

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి గురువారం 13 మే 2021 సంపుటి : 02 సంచిక :301 పేజీలు : 4 వెల : రూ 3-00


## యువకుడి దారుణ హత్య

కొమురం భీమ్ కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ లోని బాలజీనగర్ లో దారుణ హత్య జరిగింది. స్థానిక తీరందజ్ బస్తీకి చెందిన ప్రణీత్(19) ని ఇటుకలు, బండరాళ్లతో గుర్తు తెలియన వ్యక్తులు అతడిని తో కొట్టి చంపివేసారు. హత్యకు పాత కక్షలే హత్యకు కారణమని పోలీసులు నిర్ధారించారు. గత సంవత్సరం జరిగిన గుర్రం సంతోష్ హత్య కేసులు మృతుడు నిందితుడు. ఆ కేసులో జైలుకు పోయిన ప్రణీత్ .వారం క్రితమే మెయిల్ పై విడుదల అయ్యాడు. మంగళవారం రాత్రి పదకొండు సమయంలో తన ఇంటి సమీపంలో ప్రణీత్ దారుణ హత్యకు గురైయాడు. .సంఘటన స్థలానికి చేరుకున్నపోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులకోసం గాలింపు చేపట్టారు .

# కార్యాచరణ రూపొందించండి: సీఎం జగన్



ప్రతిభావంతులను ఎంపిక చేయండి

విదేశీ వర్సిటీలతో భాగస్వామ్యం

ట్రిపుల్ ఐటీలపైనా సీఎం సమీక్ష

వైద్య విద్య

ఈ వ్యవస్థలు బాగుండాలి

ఉన్నత విద్యపై సీఎం జగన్ సమీక్ష

తాడేపల్లి: విద్య, వైద్య రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, ఇందులో భాగంగా పెద్ద ఎత్తున నాడు–నేడు కార్యక్రమం కొనసాగుతోందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. యూనివర్సిటీలలో అన్ని ప్రమాణాలు పెరగాలని, ఆమేరకు కార్యాచరణ రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఉన్నత విద్యపై సీఎం జగన్ తన క్యాంపు కార్యాలయంలో బుధవారం సమీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... విద్యార్థులకు మేలు చేసేలా ప్రమాణాలు పెంచాలని, దేశంలో టాప్ టెన్‌లో రాష్ట్రంలోని యూనివర్సిటీలు నిలవాలని పేర్కొన్నారు. అదే విధంగా.. నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ (ఎన్ఐఆర్ఎఫ్)లో యూనివర్శిటీలను ఉన్నత స్థానానికి తీసుకెళ్లడంపై అధికారులతో చర్చించారు. జేఎన్టీయూ రెండు యూనివర్సిటీలు (కాకినాడ, అనంతపురం), ఆంధ్రా యూనివర్సిటీ, ఎస్వీ యూనివర్సిటీ, పద్మావతి మహిళా యూనివర్సిటీతో పాటు, ట్రిపుల్ ఐటీలను ఇప్పుడున్న పరిస్థితి నుంచి మెరుగైన పరిస్థితిలోకి తీసుకువెళ్లడంపై కార్యాచరణ రూపొందించండి. ఆ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఎన్ని నిధులు అవసరమో చెప్పండి. కడపలో రానున్న ఆర్కిటెక్చర్ యూనివర్శిటీపైన కూడా ప్రత్యేక దృష్టి పెట్టండి. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో ఏయూ ప్రస్తుతం 19వ స్థానంలోనూ, ఎస్వీ యూనివర్సిటీ 38వ స్థానంలోనూ ఉన్నాయి. రెండేళ్లలో వీటి స్థానాలు గణనీయంగా మెరుగుపడడానికి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెట్టండి. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో ఉత్తమ స్థానాల్లో ఉన్న యూనివర్సిటీలలో పద్ధతులను అధ్యయనం చేయండి. మౌలిక సదుపాయాలు, బోధనా పద్ధతులు, బోధనా సిబ్బంది తదితర అంశాల్లో తీసుకోవాల్సిన పద్ధతులపై దృష్టి పెట్టండి. ప్రతిభ ఉన్న వారినే యూనివర్సిటీల్లో బోధనా సిబ్బందిగా నియమించాలి. ఇందుకు తగిన చర్యలు తీసుకోండి. రిక్రూట్‌మెంట్ కోసం పటిష్టమైన పద్ధతులను రూపొందించండివిదేశాల్లోని అత్యుత్తమ యూనివర్సిటీల పద్ధతులను, విధానాలను కూడా అధ్యయనం చేసి వాటిని మన యూనిర్సిటీల్లోకి తీసుకొచ్చే ప్రయత్నం చేయాలి. వారి పాఠ్య ప్రణాళికలను ఇక్కడ అనుసంధానం చేసుకోవడంపైనా దృష్టి పెట్టాలి. బోధనతో పాటు, కోర్సులకు సంబంధించి విదేశీ వర్సిటీలతో భాగస్వామ్యం ఏర్పాటు చేసుకోండి. ట్రిపుల్ ఐటీల్లో ప్రస్తుతం 22,946 మంది విద్యార్థులు ఉన్నారు. శ్రీకాకుళం, ఒంగోలులో ట్రిపుల్ ఐటీల నిర్మాణాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలి. గత ప్రభుత్వ హయాంలో ట్రిపుల్ ఐటీలను పూర్తిగా నిర్లక్ష్యం చేశారు. ట్రిపుల్ ఐటీలకు సంబంధించి రూ.180 కోట్లకు పైగా నిధులను మళ్లించారు. కాబట్టి వాటిని ప్రళన చేయాల్సి ఉంది. ఇప్పుడున్న మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలి. ఇందుకోసం కార్యాచరణ రూపొందించండి. ట్రిపుల్ ఐటీల్లో మంచి బిజినెస్ కోర్సులను ప్రవేశపెట్టడంపైనా దృష్టి పెట్టండి. ఈ కోర్సులు అత్యుత్తమంగా ఉండాలి. ఇంజినీరింగ్ కోర్సులు కూడా మంచి నైపుణ్యం ఉన్న మానవవనరులను అందించేలా చూడాలిరాష్ట్రంలో ఇప్పటివరకూ 11 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉన్నాయి. కొత్తగా మరో 16 మెడికల్ కాలేజీలను తీసుకువస్తున్నాం. మెడికల్ సీట్ల సంఖ్య గణనీయంగా పెరగబోతోంది. ఆ కాలేజీలను మెరుగ్గా నిర్వహించడానికి చక్కటి విధానాలు పాటించాలి. ఆ కాలేజీల్లో 70 శాతం సీట్ల కన్వీనర్ కోటాలోనూ, మిగిలిన 30 శాతం సీట్లు పేమెంటు కోటాలో ఉండేలా ఆలోచన చేయండి. సీట్ల సంఖ్య పెరుగుతుండడంతో పేద విద్యార్థులకు మరిన్ని సీట్లు అందుబాటులోకి వస్తాయి. అంతే కాకుండా ప్రతి కాలేజీ కూడా స్వయం సమృద్ధితో నడుస్తుంది. దీంతో నిర్వహణకు ఇబ్బంది లేకుండా ఉంటుంది. విద్యా వ్యవస్థ, ఆరోగ్య వ్యవస్థ బాగు పడాలనే తపనతో వేల కోట్లు ఖర్చు చేస్తున్నాం. అందు కోసం పెద్ద ఎత్తున నాడు–నేడు కార్యక్రమం అమలు చేస్తున్నాం. ఈ సంస్థలన్నింటినీ అత్యుత్తమంగా నడుపుకునేలా చక్కటి విధానాలను తీసుకురావాలి. వీటన్నింటి పైనా అధికారులు మూడు, నాలుగు సార్లు సమావేశమై విధానాలు రూపొందించాలి. అదే విధంగా సంస్కరణలు తీసుకు రావాలి.

# కోవిడ్ బాధితులపై ఆరెస్సెస్ జోకులు : రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ : కోవిడ్ మహమ్మారి బాధితుల్లో సకారాత్మక దృక్పథాన్ని పెంచేందుకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అనుబంధ సంస్థ చేపట్టిన కార్యక్రమంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. ఈ కార్యక్రమాలు నిర్వహించడమంటే, తమ ఆత్మీయులను కోల్పోయినవారిని పరిహసించడమేనని దుయ్యబట్టారు. పాజిటివ్ థింకింగ్ అంటూ ఉపన్యాసాలు ఇస్తూ బాధిత కుటుంబాలపై జోకులేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రుల్లో పడకలు, ఆక్సిజన్, మందుల కొరత తీవ్రంగా ఉందని గుర్తు చేశారు. రాహుల్ గాంధీ బుధవారం ఇచ్చిన ట్వీట్‌లో, "తమ ఆత్మీయులను కోల్పోయిన, ఆక్సిజన్, ఆసుపత్రులు, మందుల సంక్షోభంతో బాధపడుతున్నవారి కుటుంబాలను, హెల్త్ వర్కర్లను పరిహసించడమే ఈ తప్పుడు పాజిటివ్ థింకింగ్ భరోసావవ అని పేర్కొన్నారు. తలను ఇసుకలో దూర్చినంత మాత్రానికి పాజిటివిటీ రాదన్నారు. ఇది ప్రజలకు ద్రోహం చేయడమేనన్నారు. రాహుల్ గాంధీ ప్రస్తావించిన అంశం ఏమిటంటే, ఆరెస్సెస్ అనుబంధ సంస్థ 'కోవిడ్ రెస్పాన్స్ టీమ్‌వ (సీఆర్‌టీ) ఇటీవల ఓ కార్యక్రమాన్ని ప్రారంభించింది. సీఆర్‌టీని ఆరెస్సెస్ దాని అనుబంధ సంస్థలు, కొన్ని పౌర సేవల సంఘాలు ఏర్పాటు చేశాయి. ప్రజల్లో ఆత్మవిశ్వాసం, సకారాత్మక ధోరణి (పాజిటివిటీ)లను నింపేందుకు ప్రముఖుల చేత ఉపన్యాసాలను ఇప్పిస్తోంది. ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్, విప్రో గ్రూప్ వ్యవస్థాపకుడు అజీం ప్రేమ్‌జీ, ఆధ్యాత్మిక గురువు జగ్గీ వాసుదేవ్ వంటివారు ప్రజలను ఉత్తేజపరిచే ప్రసంగాలు చేస్తున్నారు. కోవిడ్-19 మహమ్మారి సమయంలో ప్రజల్లో ఆత్మవిశ్వాసం పెంచడమే ఈ కార్యక్రమం లక్ష్యమని సీఆర్‌టీ కన్వీనర్ లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) గుర్మీత్ సింగ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ప్రసంగాలు ఆరెస్సెస్‌కు చెందిన విశ్వ సంవాద్ కేంద్రం ఫేస్‌బుక్, యూట్యూబ్ పేజీల్లో ప్రసారమవుతాయన్నారు.

# ఏపీలో కొత్తగా 21,452 కరోనా కేసులు



అమరావతి: గత 24 గంటల్లో ఆంధ్రప్రదేశ్‌లో 90,750 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా 21,452 మందికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఇప్పటివరకు రాష్ట్రంలో 13,44,386 మందికి కరోనా వైరస్ సోకింది. నిన్న ఒక్కరోజే కరోనా బారిన పడి 89 మంది మృత్యువాతపడ్డారు. దీంతో మొత్తం మరణాల సంఖ్య 8,988కు చేరింది. గడిచిన 24 గంటల్లో 19,095 మంది కోవిడ్ నుంచి కోలుకుని క్షేమంగా డిశ్చార్జ్ అవ్వగా, ఇప్పటివరకు 11 లక్షల 35 వేల 133 మంది డిశ్చార్జ్ అయ్యారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ బుధవారం కరోనాపై హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. ఏపీలో ప్రస్తుతం 1,97,370 యాక్టివ్ కేసులు ఉన్నాయి. రాష్ట్రంలో నేటి వరకు 1,76,05,687 కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.

## 'బాబు.. భారత్ బయోటెక్‌ని ఒప్పించి నీ ప్రేమను నిరూపించుకో

చంద్రబాబుపై ఘాటు వ్యాఖ్యలు చేసిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే జోగి రమేష్

తాడేపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిన్న ప్రధానికి రాసిన లేఖపై చంద్రబాబు తప్పుడు ప్రచారం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే జోగి రమేష్ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "సీఎం జగన్ కోవాగ్జిన్ పేటెంట్ ఫార్ములాని అందరికి ఇవ్వాలన్నారు. దాని వల్ల వాక్సిన్ త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావచ్చు.. ఈ ముప్పు నుంచి కాపాడవచ్చిన సీఎం జగన్, మోదీకి లేఖ రాశారు. కానీ చంద్రబాబు మాత్రం భారత్ బయోటెక్ ఏ విధంగా పెటేంట్ వదులుకుంటుందని ప్రశ్నిస్తూ.. ఆ కంపెనీకి బ్రోకర్‌లా వ్యవహరిస్తున్నారు. ఆ కంపెనీ మీ బంధువుది అయినంత మాత్రాన ఇవ్వకూడదావవ అని జోగి రమేష్ ప్రశ్నించారు. "పెన్సిలిన్ లాంటి సుబ్బామిసైన్ అనే ఔషదాన్ని తయారు చేసిన ఎల్లాప్రగడ సుబ్బారావు వ్యాపారం చేయలేదు. కేంద్రం ప్రభుత్వ ఆధీనంలోనే మెడిసిన్, ఆక్సీజన్, వాక్సిన్ అంతా ఉంది. ప్రజలు చనిపోతుంటే చంద్రబాబు పైశాచిక ఆనందం పొందుతున్నారు. బీజేపీ వాళ్లకు వాక్సిన్ కేంద్రం పరిధిలో ఉందని తెలియదా. సీఎం జగన్ మనసుపెట్టి విశాల హృదయంతో అందరికీ వాక్సిన్ ఇవ్వాలని తాపత్రయం పడుతున్నారు. కానీ చంద్రబాబు మాత్రం నా బంధువులకు సంబంధించిన భారత్ బయోటెక్‌కే పేటెంట్ ఉండాలని ఆలోచిస్తున్నాడు.

# చంద్రబాబు తెప్పించినా మాకు అభ్యంతరం లేదు : ఆళ్ల నాని

అమరావతి : కోవిడ్ కట్టడి, వ్యాక్సినేషన్‌తో పాటు తదితర సమస్యలపై సమావేశమైన మంత్రివర్గ ఉపసంఘం భేటీ ముగిసింది. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం ఆళ్ల నాని ప్రతిపక్ష నేత చంద్రబాబుపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. భారత్ బయోటెక్‌తో ఆయనకున్న బంధుత్వాన్ని ఉపయోగించి, రాష్ట్రానికి వ్యాక్సిన్‌ను తెప్పించినా తమకు ఎలాంటి అభ్యంతరమూ లేదని నాని స్పష్టం చేశారు. వ్యాక్సినేషన్ విషయంలో ప్రతిపలు కావాలని రాద్ధాంతం చేస్తున్నాయని తీవ్రంగా మండిపడ్డారు. వ్యాక్సిన్ కొనుగోలు అనేది రాష్ట్ర ప్రభుత్వ చేతిలోనే ఉందని చంద్రబాబు అవాస్తవాలు మాట్లాడుతున్నారని, ప్రజలను భయ భ్రాంతులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు.



వ్యాక్సినేషన్ ప్రక్రియ ఉచితంగా జరగాలన్నదే సీఎం జగన్ అభిమతమని, 1600 కోట్లు ఖర్చు చేయడానికి కూడా వెనకాడమని స్పష్టం చేశారు. కేంద్రం ఎన్ని వ్యాక్సిన్లు ఇశచ్చినా, పంపిణీకి తాము సిద్ధమని, ఒకే రోజు ఆరు లక్షల డోసులు వేసిన ఘనత ఏపీ సర్కార్‌దేనని ప్రకటించారు. రెండో వేవ్‌లో ఆక్సిజన్ అవసరం అధికంగా ఉందని, అందుకే ముగ్గురు సీనియర్ ఐఏఎస్ అధికారులను ఆక్సిజన్ రవాణా పర్యవేక్షణ కోసం నియమించామని తెలిపారు. రాష్ట్రానికి 910 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ అవసరమని ఇప్పటికే తాము ప్రధానికి లేఖ రాశామని, ప్రతి జిల్లాలో కూడా ఆక్సిజన్ ప్లాంట్స్ సిద్ధం చేస్తున్నామని వివరించారు. మరోవైపు ఆక్సిజన్ వృధా కాకుండా అన్ని చర్యలూ తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. ఆక్సిజన్, రెమిడెసివిర్, బెడ్స్, హోమ్ ఐసోలేషన్, కోవిడ్ కేర్ సెంటర్లపై తాము చర్చించామని వెల్లడించారు. తిరుపతిలోని రుయా ఆస్పత్రిలో చోటు చేసుకున్న సంఘటనలు పునరావృత్తం కాకుండా చేపట్టాల్సిన చర్యలపై కూడా చర్చించామని పేర్కొన్నారు. ఆక్సిజన్ సరఫరాకు స్పష్టమైన మార్గదర్శకాలను సీఎం జగన్ తమకు సూచించారని, ఆక్సిజన్ పైప్‌లైన్లను వెంటనే వెరిఫై చేయాలని తాము అధికారులను ఆదేశించామని పేర్కొన్నారు. ఆక్సిజన్ డిమాండ్‌ను బట్టి పంపిణీకి ఏర్పాట్లు చేస్తామని, 20 వేలకు పైబడి కేసులు వస్తున్నాయని వెల్లడించారు. రాష్ట్రంలో 11000 ఆక్సిజన్ బెడ్స్ ఇప్పటికే సమకూర్చామని, ఆక్సిజన్ బెడ్స్‌కి టెండర్లను పిలిచారని, ప్రస్తుతం 590 మెట్రిక్ టన్నులు ఆక్సిజన్‌ను వాడుతున్నామని ఆళ్ల నాని పేర్కొన్నారు.

# నా అక్కచెల్లమ్మలైన నర్సులందరికీ కృతజ్ఞతలు: సీఎం జగన్


అమరావతి: నేడు (బుధవారం) అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా నిస్వార్థంగా సేవ చేస్తూ ప్రతి వారిని తమ సొంతవారిలా చూసే నర్సులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతజ&జతలు తెలియజేశారు. ఈమేరకు ట్విటర్ ద్వారా స్పందించారు. "ప్రపంచ వ్యాప్తంగా, ముఖ్యంగా ఏపీలో కరోనా మహమ్మారిని ఎదుర్కొంటూ ఎంతోమందికి నిస్వార్థంగా సేవలందిస్తున్నారు నా అక్క చెల్లమ్మలైన నర్సులు. వారందరికీ మనస్ఫూర్తిగా అభినందనలు, కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. వవ అంటూ ట్వీట్ చేశారు. కరోనా అనగానే అల్లంత దూరం పారిపోయే





కుటుంబ సభ్యులున్న నేటి రోజుల్లో కరోనా రక్కసి చేతిలో విలవిలలాడుతున్న వారికి నర్సులు అందిస్తున్న సేవలు ఎనలేనివి. మానవ సేవే మాధవ సేవ అంటారు. అలా మానవ సేవ ద్వారానే తమ జీవితాన్ని సార్థకం చేసుకుంటున్న వారు నర్సులు. అయిన వారు కూడా ముట్టుకోవటానికి ఇబ్బంది పడినా, ఏ మాత్రం సంబంధం లేని నర్సులు రోగులకు సేవలు అందిస్తున్నారు.

# 44 దేశాల్లో వ్యాపించిన భారత్ రకం వైరస్



జెనీవా: కోవిడ్ రోజుకో అవతారం ఎత్తుతున్నది. తన అంతర్నిర్మాణాన్ని మార్చుకుని ఉగ్రరూపం దాల్చుతున్నది. చైనారకంతో మొదలైన తర్వాత, బ్రిటన్, బ్రెజిల్, ఆఫ్రికా రకాలు వచ్చాయి. ఇప్పుడు భారత్ రకం ప్రపంచమంతటా విజృంభిస్తున్నది. ఈ వైరస్ 44 దేశాల్లో కనిపించిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. దీనికి శాక్ష్మయంగా బీ.1.617 అని పేరుపెట్టారు. గత అక్టోబర్ లో ఇది మొదటిసారి కనిపించింది. భారత్ వెలుపల బ్రిటన్‌లో అత్యధికంగా ఈ వైరస్ ఉన్నదని ప్రపంచ ఆరోగ్య సంస్థ తెలిపింది. ఈ రకం వైరస్‌పై సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కొత్తరకం మూల వైరస్ కన్నా భిన్నంగా ప్రవర్తిస్తున్నది. ఒకరి నుంచి మరొకరికి సత్వరమే వ్యాపించడం, తీవ్రస్థాయిలో అస్వస్థత కలిగించడం, లేదా టీకాకు లొంగకపోవడం అనేవి ఈ వైరస్ లక్షణాలుగా భావిస్తున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది ఈ లక్షణాల గురించే. అనేక దేశాల్లో కోవిడ్ కేసుల్లో ఒక్కసారిగా పెచ్చరిల్లడానికి ఈ వైరసే కారణం. 130 కోట్ల జనాభా కలిగిన భారత్ కోవిడ్ కేసుల్లో అమెరికా తర్వాతి స్థానానికి వచ్చింది. రోజుకు 3 లక్షల పైచిలుకు కొత్త కేసులతో, దాదాపు 4 వేల మరణాలతో వైద్యవ్యవస్థ సామర్థ్యాన్ని ఈ వైరస్ పరీక్షకు గురిచేస్తున్నది.

# అన్నదాతలకు ఏపీ ప్రభుత్వం గుడ్ న్యూస్

అమరావతి: ఈ కరోనా కష్టకాలంలో అన్నదాతలకు ఏపీ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఖరీఫ్ పంటకాలానికి చెందిన వైఎస్సార్ రైతు భరోసా–పీఎం కిసాన్ ఈ ఆర్థిక సంవత్సరానికి చెందిన తొలి విడత సాయాన్ని రేపు రైతుల ఖాతాల్లోకి జమ చేయనున్నారు. క్యాంప్ కార్యాలయం నుంచి 'వైఎస్సార్ రైతు భరోసా – పీఎం కిసాన్ పథకంవ కింద అందించే ఈ ఏడాది మొదటి విడత సొమ్ము రూ.7,500లను రైతుల ఖాతాల్లో సీఎం జగన్ లాంఛనంగా విడుదల చేయనున్నారు. తొలి విడతగా రూ.3,882.23 కోట్లను 52.38 లక్షల రైతుల ఖాతాల్లో జమ చేయనుంది ఏపీ ప్రభుత్వం. కోవిడ్ కష్టకాలంలోనూ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో అన్నదాతలకు అండగా ఉండాలని సీఎం జగన్ ముందుకు వెళ్తున్నారు. ఈ పథకానికి సంబంధించి అర్హులైన రైతుల జాబితాలను రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రదర్శించనున్నారు. 2019–20 సంవత్సరం నుంచి సీఎం జగన్ ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తుంది. తొలి విడత మేలో రూ.7,500, రెండో విడత అక్టోబర్‌లో రూ.4 వేలు, మూడో విడత జనవరిలో రూ.2 వేల చొప్పున అన్నదాతల





ఖాతాల్లో జమ చేస్తున్నారు. గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది అదనంగా మరికొంతమంది రైతులకు ప్రయోజనం కలగనుంది. ఇప్పటివరకు రైతు భరోసా కింద రూ.13,101 కోట్ల సీఎం జగన్ ప్రభుత్వం అందించింది. రేపు విడుదల చేసే నిధులతో కలిపి ఈ మొత్తం రూ.16,983.23 కోట్లు కానుంది. జగన్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వివిధ పథకాల ద్వారా రైతులకు ఇప్పటివరకు రూ.67,953.76 కోట్ల సాయం అందించారు. అలాగే, ఈ నెలలోనే వైఎస్ఆర్ ఉచిత పంటల బీమా కింద 2వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం అందించనుంది.

# సంపాదకీయం

గురువారం 13 మే 2021

## బ్రిటీష్ రాజ్ ను తలపిస్తున్న సర్కార్

తాటి చెట్టు ఎందుకు ఎక్కావంటే దూడ గడ్డి కోసమని సమాధానం చెప్పాడట వెనకటికి ఒకాయన. తాగుబోతు తెలివితేటలు అలాగే ఉంటాయి. ఎవరు ఏమనుకుంటే నాకేమిటి? ఏదో ఒక సమాధానం చెప్పేస్తే చాలు అనుకుంటాడు. కేంద్ర ప్రభుత్వ వైఖరి అచ్చం ఆ మొరటు సామెతను తలపింపచేస్తోంది. వాక్సిన్లు, మెడికల్ ఆక్సిజన్, వైద్య ఉపకరణాలపై జీఎస్టీ రద్దు చేయమని డిమాండ్లు వస్తున్నాయి. చాలా రాష్ట్రప్రభుత్వాలు ఈ విషయంలో కేంద్రానికి విజ్ఞప్తి చేస్తున్నాయి. జీఎస్టీ రద్దు చేస్తే వినియోగదారులపైన భారం పడుతుందంటూ కేంద్రం వితండ వాదం మొదలు పెట్టింది. పైపెచ్చు మేము విధించే జీఎస్టీలో సగం మీకు కూడా ఇస్తున్నాం కదా.. అంటూ రాష్ట్రాలను మచ్చిక చేసే ప్రయత్నమూ చేస్తోంది. తోలు వలచి ప్రజలపై విధించే పన్నులను మనమూ మనమూ పంచుకుందామంటూ రాష్ట్రాలను బులిపిస్తోంది. ఒకవేళ జీఎస్టీ రద్దు చేస్తే తయారీ దారులు ముడిపదార్థాలు, సేవలకు చెల్లించిన పన్నులను రాబట్టుకోలేక ధరలు పెంచేస్తారనే సాకు చెబుతోంది. ధరలను అదుపులోఉంచేందుకే వాటిపై జీఎస్టీ విధిస్తున్నామంటూ కొత్త వాదన ముందుకు తెస్తోంది. ఇవన్నీ కట్టుకథలు, ఊహా జనితాలు అంటూ ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా తయారీదారులకు పరిహారం కేంద్రం చెల్లించవచ్చని , కావాలనే జీఎస్టీని రద్దు చేయడం లేదని స్పష్టంగా చెబుతున్నారు. ప్రజాప్రభుత్వానికి ఉండాల్సిన సున్నితత్వాన్ని కేంద్రం కోల్పోయింది. మెడికల్ ఉపకరణాలు, మందులపై జీఎస్టీ తీసేయమని రాష్ట్రాలే డిమాండ్ చేస్తున్నాయి. అందువల్ల వాటికీ కొంత నష్టం వాటిల్లుతుంది. దానిని భరించేందుకు సిద్దంగా ఉన్నాయి. అయినప్పటికీ కేంద్రం తన వాటా పన్నును వదులుకోవడానికి సిద్దంగా లేదు. అందుకే పన్నులు కొనసాగిస్తోంది. పైపెచ్చు ఈ కొత్త పద్ధతిని అమలు చేస్తే భవిష్యత్తులో మరిన్ని డిమాండ్లు రావచ్చనే భయమూ కారణం కావచ్చు. తమకు మంచి చేస్తాయని ప్రభుత్వాలను ప్రజలు ఎన్నుకుంటారు. ముక్కుపిండి పన్నులు రాబట్టుకోవడమే ధ్యేయంగా పనిచేస్తారని కలలో కూడా ఊహించరు. మమతా బెనర్జీ లేఖకు కేంద్ర ఆర్థిక మంత్రి ఇచ్చిన సమాధానంతో ఒక విషయం స్పష్టమైపోయింది. కేంద్ర ప్రభుత్వానికి ప్రజలతో సంబంధాలు తెగిపోయాయి. ప్రజలు ఏమనుకుంటున్నారో, ఎలా స్పందిస్తున్నారో కూడా ఆలోచించేందుకు సిద్ధపడటం లేదు. మమతా బెనర్జీ ప్రజలతో మమైకమై తిరిగే మాస్ లీడర్. ప్రజలకు కావాల్సింది ఏమిటో ఆమెకు బాగా తెలుసు. దానిని స్వీకరించేందుకు సిద్దంగా లేకపోవడం కేంద్ర ప్రభుత్వ మూర్ఖత్వం. పూర్వకాలంలో రాజులు, ఆ తర్వాత బ్రిటిష్ పాలకులు దేశ ప్రజలతో సంబంధాలు లేకుండా ఇష్టారాజ్యంగా పన్నులు విధించేవారు. గడ్డం పెంచుకుంటే పన్ను, తీర్థయాత్రకు వెళితే పన్ను, ఉప్పుపై పన్ను ఇలా నానారకాలుగా వేధించేవారు. ఆ తీరును నయా పాలకులు తలపింపచేస్తున్నారు. దేశం విలవిలలాడిపోతోంది. రెండు నెలలపాటు ఎన్నికల పుణ్యమా అంటూ పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచకుండా ఉంచారు. తాజాగా నాలుగు రోజుల నుంచి వరసగా పెరుగుతున్నాయి. ప్రజల ఆదాయం పడిపోయింది. ఉపాధి కోల్పోతున్నారు. నిత్యావసరాల ధరలు కొండెక్కి కూర్చున్నాయి. బ్యాంకుల్లో ఖాతా ఉంటే చాలు జీఎస్టీ రూపంలో నెలవారీ కొంత మొత్తం వసూలు చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని పన్ను ఇది. ఈ ఎన్డీఏ ప్రభుత్వంలోనే ప్రవేశపెట్టారు. అంతకుముందు తమ కాతాదారులకు బ్యాంకులు ఉచితంగాఈ సేవలను అందించేవి. చట్టబద్ధమైన దోపిడీగా ప్రజల నుంచి పన్నులు రాబడుతున్నారు. మతం కార్డు, భావోద్వేగాలు ఎల్లకాలం పని చేయవు. మరోసారి అధికారంలోకి రాకపోయినా ఫర్వాలేదనుకుంటున్న నాయకులకు ప్రజలే సకాలంలో బుద్ధి చెబుతారు. తెలుగు రాష్ట్రాలది విచిత్రమైన పోకడ. మమత బెనర్జీ, అరవింద్ కేజ్రీవాల్, నవీన్ పట్నాయక్ వంటి ముఖ్యమంత్రులు తమ ప్రజలకోసం డిమాండ్లు పెడుతూ కేంద్రాన్ని నిలదీసే ప్రయత్నం చేస్తున్నారు. మన రాష్ట్రాల్లో కక్ష సాధింపు రాజకీయాలకే పెద్ద పీట. ఈటల రాజేందర్ టార్గెట్ గా ఐఏఎస్ ల బృందాల నియామకాన్ని హైకోర్టు తప్పు పట్టింది. ఇప్పుడున్న పరిస్థితులు ఏమిటి? ప్రభుత్వ వైఖరి ఏమిటంటూ నిరసన వ్యక్తం చేసింది. అటు ఆంధ్రప్రదేశ్ లో చంద్రబాబు నాయుడిపై కేసు పెట్టి సవాల్ విసురుతోంది ప్రభుత్వం. దానిపై కొందరు టీడీపీ సానుభూతిపరులు రాష్ట్ర మంత్రిపై కేసు పెట్టారు. మొత్తమ్మీద ఈ రెండు రాష్ట్రాలు కేంద్రం తరహాలోనే వింత పోకడలతో ప్రవర్తిస్తున్నాయి. వ్యవస్థలను దుర్వినియోగం చేసే తెగింపు, తమకు చెప్పేవారెవరన్న అహంకార ధోరణి ప్రబలిపోతున్నాయి.

# అర్ధం కాని లోకేష్ లెక్కలు



గుంటూరు, మే 12, (న్యూస్ పల్స్)తెలుగుదేశం భావి వారసుడు లోకేష్ అన్నది అందరికీ తెలిసిందే. చంద్రబాబు తరువాత పార్టీకి ఆయనే అని కూడా అంటారు. ఒక విధంగా ఉత్తరాధికారి అన్న మాట. అయితే ఇది తమ్ముళ్లకు ఇతర పార్టీ నేతలకు ఎంత వరకూ ఇష్టం అన్నది పక్కన పెడితే పార్టీలో చంద్రబాబు బలవంతుడు కాబట్టి ఆయన చెప్పిందే వేదం కాబట్టి లోకేష్ విషయంలో ఎవరూ కిక్కురుమనలేరు. ఇక తమ్ముళ్లకు జూనియర్ ఎన్టీయార్ వస్తే పార్టీ బాగుపడుతుంది అన్న ఆశ ఉంది. కానీ బాబు మాత్రం అదేం కుదరదు అని క్లారిటీగా చెప్పేస్తున్నారు. అందుకే లోకేష్ ని ఆయనే స్వయంగా మరింత ముందుకు తోస్తున్నారు. లోకేష్ టీడీపీకి నాయకత్వం వహిస్తే ఎవరికి లాభం అంటే కచ్చితంగా వైసీపీకే అన్న మాట ఉంది. ఎందుకంటే చంద్రబాబు రాజకీయ వ్యూహాలు ఎపుడూ వైసీపీని ఉక్కిరిబిక్కిరి చేస్తూంటాయి. బాబుకు అన్ని వ్యవస్థలలో ఉన్న విస్తృతమైన పరిచయాలు, ఆయన చాణక్య రాజకీయమే ఇప్పటిదాకా టీడీపీని కాపాడుకుంటూ వస్తోంది. టీడీపీకి ఏకైన చరిష్మాటిక్ లీడర్ అన్న ఎన్టీయార్ మాత్రమే. ఆయన దివంగతులు అయ్యాక పాతికేళ్లుగా పార్టీని బాబు లాక్కువచ్చారూ అంటేనే ఆయన రాజకీయం ఎంత పదునైనదో అర్ధమవుతుంది. ఇక లోకేష్ ని బాబుతో ఏ విధంగానూ పోల్చడానికి లేదు. తండ్రి చాటు బిడ్డగానే ఆయన ఇప్పటికీ ఉంటారని పేరుఇక లోకేష్ చేసే సవాళ్ళను ఇన్నాళ్ళూ వైసీపీ సీరియస్ గా తీసుకోలేదు. జూనియర్ అంటూ పక్కన పెట్టేసింది. కానీ తిరుపతి ఉప ఎన్నిక నుంచీ ఒక వ్యూహం ప్రకారం వైసీపీ మంత్రులు లోకేష్ కి కౌంటర్లు ఇస్తూ వస్తున్నారు. చంద్రబాబుకు ఏ విధంగా జవాబు చెబుతారో అదే విధంగా లోకేష్ కి విపక్ష హోదాను ఇస్తూ వైసీపీ ఆడుతున్న ఈ గేమ్ వెనక పెద్ద రాజకీయమే ఉందని అంటున్నారు. టీడీపీలో లోకేష్ పొడ గిట్టని వారు రాష్ట్ర స్థాయి నాయకుల దాకా ఎక్కువగానే ఉన్నారు. అటువంటి వేళ లోకేష్ ని ఆ పార్టీలో పెంచితే ఒక విధంగా తమకే అది కలసి వస్తుంది అన్న స్ట్రాటజీతో వైసీపీ ఉంది అంటున్నారు. లోకేష్ మాత్రమే టీడీపీకి నాయకుడిగా ఉండాలని బాబు కోరుకుంటున్నారు. ఆయనే ఉండాలని ఇపుడు వైసీపీ కూడా కోరుకుంటోందా అన్న డౌట్లు వస్తున్నాయి. లోకేష్ మాటకు మరో మాట అంటూ పొలిటికల్ గా అగ్గి రాజేస్తున్న వైసీపీ ఆయన మీద బాగానే ఫోకస్ పెట్టింది అంటున్నారు. దాంతో టీడీపీలో లోకేష్ సహజంగానే పెద్ద నాయకుడిగా ఎక్స్ పోజ్ అవుతారు. ఆ మీదట నచ్చినా నచ్చకపోయినా మిగిలిన వారు అంతా లోకేష్ కీర్తనలు అందుకోవాల్సిందే. ఇక లోకేష్ సారధ్యంలో టీడీపీ అంగుష్టమాత్రంగానే మిగిలిపోతుంది అన్న లెక్కలు కూడా వైసీపీకి ఉన్నాయట. మొత్తానికి శత్రు శిబిరంలో ఎవరు ఉండాలో ఒకనాడు బాబు నిర్ణయించేవారు. ఇపుడు అదే వ్యూహాన్ని జగన్ కూడా అనుసరిస్తున్నారు అంటున్నారు. లోకేష్ టీడీపీలో ఎంత ఎదిగితే అది వైసీపీకి, జగన్ కి అంత మేలు చేసేదే అన్న మాట అయితే ఇపుడు ఉంది.

# డబ్బులు పంచకుండా తిరుపతి ఓట్లు

తిరుపతి, మే 12, (న్యూస్ పల్స్)ఏపీలో రెండే రాజకీయ పార్టీలు, అటూ ఇటూ భీకరమైన పోటీ. ఆ రెండు పార్టీలు గట్టిగా ఒక నిర్ణయం తీసుకుంటే చాలు రాజకీయాల్లో ఎన్నో విప్లవాత్మకమైన మార్పులు వస్తాయి. సంస్కరణలకు కూడా వీలు పడుతుంది. అధికార వైసీపీ, విపక్ష టీడీపీ రెండూ కూడా పోటా పోటీగా సై అంటే మాత్రం ఏపీలో రాజకీయం పాతాళానికే పడిపోతుంది. ఇంతకాలం అదే జరిగింది. కానీ తిరుపతి లోక్ సభ ఉప ఎన్నికల్లో మాత్రం ఒక అద్భుతమే జరిగింది. నిజానికి ఈ నిర్ణయం మొదట జగన్ తీసుకున్నారు. ఆయన తీసుకోవడానికి కూడా కారణం ఉంది. తమ పార్టీకి ఎటూ తిరుపతి లోక్ సభ ఉప ఎన్నికల్లో విజయం ఖాయం. అందువల్ల ప్రత్యేకించి ఓట్లకు డబ్బులు పంచడం అన్నది దండుగ మారి వ్యవహారం. పైగా చెడ్డ అవుతుంది అని ఆయన ఆలోచించారు. ఇక తమ ప్రభుత్వం చేతికి ఎముక లేకుండా సంక్షేమ పంట పండిస్తోంది. వాటిని పొందిన వారు కృతజ్ఞతతో అయినా ఓటు వేయాలి కదా. మరో వైపు చూస్తే టీడీపీ కూడా రెండేళ్ళుగా చితికిపోయి ఉంది. తాము కనుక ఓట్ల కొనుగోలుకు చెక్ పెడితే ఆ పార్టీ కూడా మహదానందంగా ముందుకు వస్తుంది. వారు కూడా ఉపశమనం పొందుతారు కాబట్టి అటు నుంచి కూడా ఓట్ల కొనుగోలు ఉండదు. ఈ రకమైన లెక్కలతోనే జగన్ తమ పార్టీ నుంచే ముందుగా ఈ సంస్కరణలకు తెర తీశారు. అంతే కాదు, ఏ నేత అయినా ఓటుకు నోటు ఇచ్చారని తెలిస్తే ఏకంగా పార్టీ నుంచే పంపిస్తామని కూడా గట్టి హెచ్చరికలు చేశారు. దాంతో మొత్తం బంద్ అయింది. అపుడెపుడో ఎన్టీయార్ జమానాలో ఓటుకు నోటు అన్నది లేకుండా ఎన్నికలు జరిగాయని చెప్పుకుంటారు. ఎన్టీయార్ కేవలం ప్రచార సామగ్రి మాత్రమే తమ అభ్యర్ధులకు ఇచ్చేవారు. అంతే తప్ప వేరేగా నగదు బదిలీ చేసేవారు కాదు. ఓటుకు నోటు అంటే ఆయనకు ఒళ్ళు మంట. పైగా రామారావు ప్రజాదరణ ముందు ఎవరూ నోట్లు డిమాండ్ చేసే సీనే నాడు లేదు. అయితే ఆయన స్థానంలో సీఎం అయిన చంద్రబాబు పార్టీకి ప్రెసిడెంట్ గా కూడా కుదురుకున్నాక ఎన్నికల్లో డబ్బు ప్రమేయం బాగా పెరిగింది అన్న ప్రచారం అయితే ఉంది. మొత్తానికి మొదట్లో లక్షల్లో ఉన్న ఆ ధన ప్రవాహం ఇపుడు వందల కోట్లకు పడగెత్తింది. ఇపుడు అదే టీడీపీకి కూడా గుదిబండగా మారుతోంది. పార్టీలో ఆర్థిక వనరుగా ఉండే బడా నేతలు అంతా తప్పుకున్నాక టీడీపీకి కూడా డబ్బుతో రాజకీయాలు చేయడం ఎంత కష్టమో ఒక్కసారిగా అర్ధమైంది అంటారు. దాంతో తిరుపతి ఉప ఎన్నికల్లో టీడీపీ కూడా పైసా తీయకుండానే రాజకీయం సాగించింది. ఎన్నికల్లో ధన ప్రభావం ఎక్కువ అయిపోతోంది అని వామపక్షాలు ఇతర పార్టీల నేతలు పదే పదే ఆరోపిస్తూ ఉంటారు. అది కూడా వైసీపీ, టీడీపీలను ఉద్దేశించే అంటారు. ఇపుడు మంచికో మరో దానికో తిరుపతి ఉప ఎన్నికలో సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. దీన్నే ఇక మీదట రెండు పార్టీలు కంటిన్యూ చేయాలని మేధావుల నుంచి వినిపిస్తున్న మాట. నిజానికి జగన్ 2014, 2019 ఎన్నికల వేళ కూడా అభ్యర్ధులకు నగదు సహాయం చేయలేదు అన్న విమర్శలు సొంత పార్టీలో ఉన్నాయి. అయితే ధనవంతులకు చాలా చోట్ల టికెట్ ఇవ్వడంతో వారు బాగానే ఖర్చు పెట్టారు. ఇపుడు జగన్ తలచుకుంటే ధన రహిత రాజకీయాలను అన్ని ఎన్నికల్లో కొనసాగించవచ్చు, ఆయన కనుక అది అమలులో పెడితే టీడీపీ కూడా అదే బాటన నడిచే అవకాశాలు ఉంటాయని అంటున్నారు. ఈ విషయంలో బాబూ జగన్ ఒట్టు పెట్టుకుని మరీ ముందుకు సాగితే ఏపీలో ఆదర్శవంతమైన రాజకీయమే చూడవచ్చు అని విద్యావంతులు మేధావులు అభిప్రాయపడుతున్నారు.

# ఇక ఉప ఎన్నికలు లేనట్టే

కడప, మే 12, (న్యూస్ పల్స్)ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ లో ఎక్కువగా ఉప ఎన్నికలు జరిగిన సమయం 2004 నుంచి 2014 అని చెబుతారు. ఆ పదేళ్ల కాలంలో అటు తెలంగాణా ఉద్యమం, మరో వైపు జగన్ వైసీపీ ఆవిర్భావంతో తొడగొట్టి మరీ ఉప ఎన్నికలు తెచ్చేవారు. దాంతో అటు టీయారెస్ ఎమ్మెల్యేలు, ఎంపీల రాజీనామాలు చేస్తూ ఉద్యమాన్ని వేడెక్కిస్తే ఇటు సీమాంధ్రలో జగన్ కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేలను చేర్చుకుని రాజీనామాలు చేయించి మరీ ఉప ఎన్నికలు తెచ్చి పెట్టేవారు. ఇక 2014 నుంచి 2019 మధ్యన చూస్తే ఏపీలో ఒకే ఒక ఉప ఎన్నిక నంద్యాలలో మాత్రమే జరిగింది. తెలంగాణాలో కూడా పెద్దగా ఉప ఎన్నికలు నాడు జరగలేదు. ఇక 2019 నుంచి చూస్తే సీన్ మొత్తం రివర్స్ అయినట్లుగా ఉంది. అనూహ్యంగా కరోనా వైరస్ ప్రపంచాన్ని చుట్టుముట్టడంతో దానికి బలి అయిన వారిలో ఎక్కువగా ప్రజా ప్రతినిధులు ఉంటున్నారు. ఆ విధంగా చూసుకుంటే ఏపీలో తిరుపతి లోక్ సభ సభ్యుడు బల్లి దుర్గాప్రసాద్ గత ఏడాది కరోనాతో మరణించారు. దానికి తాజాగా ఉప ఎన్నిక జరిగింది. ఇక తెలంగాణాలో ఇద్దరు టీయారెస్ ఎమ్మెల్యేలు కరోనా కాటుకు బలి అయ్యారు. అలా దుబ్బాక, నాగార్జునసాగర్ ఉప ఎన్నికలు జరిగాయి. ఈలోగా ఏపీలో కడప జిల్లా బద్వేల్ వైసీపీ ఎమ్మెల్యే వెంకట సుబ్బయ్య కూడా కరోనాతోనే మరణించారు. దానికి ఇపుడు ఉప ఎన్నిక అనివార్యం అయింది. ఇక లోకల్ బాడీస్ కి రెండు నెలల క్రితం ఎన్నికలు జరిగితే చాలా మంది గెలిచారు. అందులో కూడా ఇపుడు పలువురు కరోనాతో తనువులు చాలిస్తున్నారు. మహా విశాఖ నగరపాలక సంస్థ 31వ వార్డుకు చెందిన కార్పొరేటర్ వానపల్లి రవికుమార్ కరోనాతో మరణించడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యం అయింది. మరో వైపు వైసీపీకి చెందిన 61వ వార్డుకు చెందిన కార్పొరేటర్ దాడి సూర్యకుమారి అకాల మరణంతో అక్కడ కూడా ఉప ఎన్నిక జరగనుంది. అలాగే గుంటూరు నగర పాలకసంస్థకు చెందిన వైసీపీ కార్పొరేటర్ కూడా ఈ మధ్యన కరోనాతో బలి అయ్యారు. అక్కడా ఉప ఎన్నిక జరిగే వీలుంది. ఇక ఏపీలో పలు జిల్లాల్లో పంచాయతీల వార్డు సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు కూడా కరోనా తో మృతి చెందిన చోట్ల కూడా ఉప ఎన్నికలు తప్పనిసరిగా జరగనున్నాయి. నిజానికి కరోనా అన్నది ప్రపంచ మానవాళికి పెను ముప్పుగా పరిణమించింది. అదే సమయంలో రాజకీయ నాయకులకు అది అతి పెద్ద సమస్యగా మారుతోంది. రాజకీయ నాయకులు ప్రజలతో నిరంతరం అనుబంధం కలిగి ఉంటారు. కరోనా లాంటి విపత్తు వేళ వారు మరింతగా జనాల వద్దకు వెళ్తూండాలి. ఈ విధి నిర్వహణలోనే వారు కరోనా కాటుకు గురి అవుతున్నారు. కేవలం ఏపీకి మాత్రమే కాదు, దేశవ్యాప్తంగా కూడా పలు రాష్ట్రాలలో కరోనా మరణాలలో ఎక్కువగా ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

# కళాకు తప్పని సన్ స్ట్రోక్

శ్రీకాకుళం, మే 12, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత కళా వెంకట్రావుకు భవిష్యత్ పై బెంగ పట్టుకుంది. తన వారసుడికి రాజకీయాలను అప్పగించాలనుకున్న ఆయనకు అడుగడుగునా ఆటంకాలు ఎదురవుతున్నాయి. కళా వెంకట్రావు గతంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. అయితే ప్రస్తుతం ఆయన కేవలం ఎచ్చర్ల నియోజకవర్గానికే పరిమితమయ్యారు. తాను చే?సిన రాజకీయాలే కళా వెంకట్రావుకు శాపంగా మారాయన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి. కళా వెంకట్రావుకు రాజాం నియోజకవర్గంలో పట్టుంది. ఆయన ఆ నియోజకవర్గం కూడా తన కనుసన్నల్లోనే జరగాలని భావించారు. గతంలో ఇక్కడ పోటీ చేసిన టీడీపీ నేతలకు కూడా కళా వెంకట్రావు సహకరించలేదు. దీంతో వరసగా రాజాం నియోజకవర్గంలో వరస ఓటములు తప్పలేదు. 2009లో ఏర్పడిన ఈ నియోజకవర్గంలో ఇప్పటి వరకూ తెలుగుదేశం పార్టీ ఇక్కడ విజయం సాధించలేదు. దీనికి కారణం కళా వెంకట్రావు వైఖరేనన్న కామెంట్స్ వినపడుతున్నాయి. ఇక ఆయన గతంలో ప్రాతినిధ్యం వహించిన ఎచ్చర్ల నియోజకవర్గంలో పెద్దగా దృష్టి పెట్టేవారు కాదు. అంతా రాజాం మీదే కళా వెకట్రావు కన్ను ఉండేది. కానీ ఎచ్చర్లలోనూ సొంత పార్టీలో కళా వెంకట్రావుకు పోటీ వర్గం తయారయింది. దీంతో కళా వెంకట్రావు రాజాం ను వదిలేసి ఎచ్చర్లలోనే మకాం వేయాలని నిర్ణయించుకున్నారు. వచ్చే ఎన్నికల్లో తన కుమారుడిని పోటీ చేయించాలని భావిస్తున్నారు. అందుకోసమే కళా వెంకట్రావు ఎచ్చర్ల నియోజకవర్గంలో తనను వ్యతిరేకిస్తున్న నేతలను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నారు. తనపై స్థానికేతరుడిగా ముద్రవేయడం ఒక కారణంకాగా, వచ్చే ఎన్నికల్లో తనకు ఇబ్బంది కాకూడదనే టీడీపీ కీలక నేతలను కూడా పార్టీ నుంచి పంపించి వేస్తున్నారు. తన కుమారుడు రామ్ మల్లిక్ నాయుడును ఫోకస్ చేయడం కోసం పేరున్న నేతలను బయటకు పంపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. కళా వెంకట్రావు లోకేష్ కు ఆప్తుడు కావడంతో పార్టీ కూడా ఇక్కడి విషయాలను పెద్దగా పట్టించుకోవడం లేదు.

# అచ్చెన్నపై తిరుపతి ప్రభావం

తిరుపతి, మే 12, (న్యూస్ పల్స్)రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా అచ్చెన్నాయుడిని నియమించారు. అయితే ఆయనకు పెద్దగా పని కల్పించడం లేదు. అంతా చంద్రబాబు, లోకేష్ లు నిర్ణయం తీసుకోవడం, జిల్లా పర్యటనలకు కూడా అనుమతించకపోవడం ఇప్పుడు పార్టీలో చర్చనీయాంశంగా మారింది. అచ్చెన్నాయుడు ను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నామమాత్రంగానే ఉంచారన్న వ్యాఖ్యలు పార్టీలో విన్పిస్తున్నాయి. చంద్రబాబు నాయుడు అచ్చెన్నాయుడిని రాష్ట్ర అధ్యక్షుడిగా ఎంపిక చేసి సరైన నిర్ణయమే తీసుకున్నారు. అచ్చెన్నాయుడు ఈఎస్ఐ స్కాంలో అరెస్ట్ అయిన తర్వాత ఆయనపై సానుభూతి పెరిగింది. పైగా బీసీ వర్గానికి చెందిన నేత. తనకు, పార్టీకి నమ్మకమైన కుటుంబంగా పేరుంది. నోరున్న నేత కావడంతో జగన్ పై విమర్శలు చేసేందుకు అచ్చెన్నాయుడును ఉపయోగించుకోవాలని చంద్రబాబు భావించారు. అందుకే తిరుపతి ఉప ఎన్నికలో అచ్చెన్నాయుడికి కీలక బాధ్యతలను అప్పగించారు. అచ్చెన్నాయుడు కూడా నెలరోజుల పాటు తిరుపతిలోనే ఉండి రాష్ట్ర అధ్యక్షుడిగా నేతలందరిని సమన్వయం చేయగలిగారు. కానీ తిరుపతిలోనే తేడా కొట్టింది. తాను రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నా ఎన్నికల నిధుల ఖర్చు విషయంలో పక్కన పెట్టడాన్ని అచ్చెన్నాయుడు తప్పుపట్టారంటున్నారు. చంద్రబాబు, లోకేష్ లు తమకు నమ్మకమైన నేతలకే నిధుల ఖర్చు బాధ్యతలను అప్పగించారు. ఆ కోపంతోనే అచ్చెన్నాయుడు నారా లోకేష్ పై వ్యాఖ్యలు చేశారంటున్నారు. ఇక లోకేష్ పై వ్యాఖ్యల తర్వాత చంద్రబాబు అచ్చెన్నాయుడును పెద్దగా పట్టించుకోవడం లేదని చెబుతున్నారు. హైదరాబాద్ లో ఉన్న చంద్రబాబు సీనియర్ నేతలతో మాట్లాడుతున్నా అచ్చెన్నాయుడుతో అంటీ ముట్టనట్లు వ్యవహరిస్తున్నారని అంటున్నారు. జిల్లాల పర్యటనలు తనకు తెలియకుండా ఎవరు చేయవద్దని చంద్రబాబు ఆదేశించినట్లు తెలిసింది. ఈ ఆదేశం అచ్చెన్నాయుడిని దృష్టిలో పెట్టుకుని ఇచ్చిందేనన్న కామెంట్స్ పసుపు పార్టీలో వినిపిస్తున్నాయి.

# అడ్డంగా బుక్కైన అప్పలరాజు

శ్రీకాకుళం, మే 12, (న్యూస్ పల్స్)మంత్రి అయి ఏడాది కూడా కాలేదు కానీ దూకుడు విషయంలో శ్రీకాకుళం మంత్రి సీదరి అప్పలరాజు పేరునే అంతా చెప్పుకుంటారు. టీడీపీకి బలమైన ఈ జిల్లాలో అప్పలరాజు గట్టిగానే వారిని సవాల్ చేస్తూ ఎక్కడికక్కడ నిలువరిస్తున్నారు. గౌతు ఫ్యామిలీకి పట్టున్న పలాసాతో పాటు ఏపీ టీడీపీ ప్రెసిడెంట్ అచ్చెన్నాయుడు ఇలాకాలోనూ టీడీపీని ఓడించి లోకల్ బాడీ ఎన్నికల్లో వైసీపీకి ఏకపక్ష విజయం దక్కించడంతో అప్పలరాజు కీలకమైన పాత్ర పోషించారు. ఆయన మాటల తూటాలు బాగా పేలుస్తారు. అయితే రాజకీయాలకు కొత్త కావడంతో కొన్ని సార్లు దొరికేస్తూ ఉంటారు. ఏపీలో అతి భయంకరమైన కరోనా వైరస్ రకం ఎన్ 440 కె ఉందని చంద్రబాబు జూమ్ యాప్ ద్వారా గట్టిగా ప్రచారం చేశారు. కరోనా తో జనాలు చనిపోతూంటే సర్కార్ పట్టించుకోవడం లేదని కూడా బండలు వేశారు. అయితే ఆయన విపక్ష నేత కాబట్టి అలాగే మాట్లాడుతారు. మరి బాధ్యత కలిగిన మంత్రి హోదాలో ఉన్న అప్పలరాజు కూడా ఏపీలో ఎన్ 440 కె వైరస్ ఉందని ప్రచారం చేయడం ఎంతవరకూ సబబు. పైగా దాని వల్ల 15 రెట్లు ఎక్కువగా కరోనా వ్యాప్తి ఉంటుందని కూడా నోరు జారేసి అప్పలరాజు చాలా ముందుకు వెళ్ళిపోయారు. దీంతో ఆయన బాబు బాటలోనే నడిచారని వైసీపీలో చర్చ సాగుతోంది. చంద్రబాబు మీద యాక్షన్ కి దిగిన వైసీపీకి అప్పలరాజు కాళ్ళకు బంధంగా మారాడని అంటున్నారు. అతి ఉత్సాహంతో ఈ మంత్రి మీడియా ముందు మాట్లాడిన ఈ మాటలే ఇపుడు వైసీపీ పెద్ద వ్యూహానికి పెద్ద దెబ్బ కొట్టేసాయని అంటున్నారు. చంద్రబాబు ని ఏదో విధంగా బుక్ చేయాలని పడిన ఆరాటానికి అప్పలరాజు అడ్డుపడిపోయాడని అంటున్నారు. కరోనా విషయంలో సోషల్ మీడియాతో పాటు చాలా చోట్ల తలో రకంగా ప్రచారం సాగుతోంది. అయితే అవన్నీ వ్యక్తిగతమైనవి. బాధ్యత ఉన్న మంత్రిగా అప్పలరాజు లాంటి వారే జనాలను భయపెడితే ఎలా అంటున్నారు. దాంతో ఆయన మీద కూడా కర్నూల్ లో కేసులు వరసపెట్టి పడిపోయాయి. చిత్రమేంటి అంటే వైసీపీలో వైద్య మంత్రి ఎవరూ అంటే ఎవరూ ఠక్కున జవాబు చెప్పలేరు. గోదావరి జిల్లాలకు చెందిన ఆళ్ళ నాని ఈ శాఖను చూస్తున్న సంగతి వారి జిల్లాకే తెలియదు అన్నట్లుగా ఆయన ఉంటారు. కరోనా విషయంలో కానీ దానికి సంబంధించిన చర్యల మీద కానీ మాట్లాడాల్సిన అథారిటీ ఉన్న మంత్రి ఆళ్ళ అయితే ఆయన ఫుల్ సైలెంట్ గా ఉంటారు. మంత్రులు జోక్యం చేసుకుంటారు. దాంతోనే వస్తోంది తంటా అంటున్నారు. ఇపుడు చంద్రబాబు మీద కేసు పెట్టి వైసీపీ కక్ష సాధింపులకు తెర తీసింది అన్న చెడ్డ పేరు తెచ్చుకుంది. అదే మాటలు అన్న తమ మంత్రి సీదరి అప్పలరాజు మీద కూడా కేసు పెడితేనే ఆ మచ్చ పోతుంది. మరి అన్నెం పున్నెం ఎరగని అప్పలరాజు మీద యాక్షన్ తీసుకుంటారా. ఇంతకాలం బాగా పని చేసి జగన్ వద్ద మంచి మార్కులు తెచ్చుకున్న అప్పలరాజునోరు చేసి బుక్ అయ్యారే అని అనుచరులు బాధపడుతున్నారు.

# అయోధ్య రాజకీయాలకు గుడ్ బై

గుంటూరు, మే 12, (న్యూస్ పల్స్)రాజ్యసభ పదవి అనేది అందరికీ దక్కదు. ఆ అరుదైన అవకాశం కొందరికే దక్కుతుంది. అలాంటి వారు పార్టీకి ఎంతో కొంత ఉపయోగపడాల్సి ఉంటుంది. అయితే రాజ్యసభ సభ్యులు ప్రజల్లో ఉండే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ప్రజాప్రతినిధులతోనూ వారికి పెద్దగా అవసరం ఉండదు. అందుకే పార్టీని గురించి పట్టించుకోరు. తమకు చేతనైంత ఆర్థిక సాయం మాత్రమే చేస్తారు. ఏ పార్టీలోనైనా కొందరు రాజ్యసభ సభ్యులు మాత్రమే యాక్టివ్ గా ఉంటారు. వైసీ?పీ విషయానికి తీసుకుంటే ప్రస్తుతం రాజ్యసభ లో ఆరుగురు రాజ్యసభ సభ్యులున్నారు. వీరిలో విజయసాయిరెడ్డి ఒక్కరే రాజకీయంగా యాక్టివ్ గా ఉంటారు. రాజ్యసభ లోనూ వీరి పాత్ర పెద్దగా కన్పించదు. వైసీపీ?కి విజయసాయరెడ్డి, అయోధ్య రామిరెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, మోపిదేవి వెంకటరమణ, పరిమళ్ నత్వానిలు రాజ్యసభ సభ్యులుగా ఉన్నారు. వీరిలో మోపిదేవి, పిల్లి కిందిస్థాయి రాజకీయాల నుంచి వచ్చిన వారే. వారు స్థానిక సంస్థల ఎన్నికల్లో కొంత ప్రచారం చేశారు. పరిమళ్ నత్వాని ఇక మన రాష్ట్రానికి చెందిన వారు కాకపోవడంతో ఆయన గురించి చర్చ అనవసరం. ఇక వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి ప్రజాసేవ చేస్తూ రాజ్యసభ లోకి అడుగుపెట్టారు. ఆయన పార్టీలో అంతర్గత విభేదాలను పరిష్కరించడం, ఎన్నికల్లో ఆర్థిక సాయం అందించడమే పనిగా పెట్టుకున్నారు. ఇక రోజు వారీ రాజకీయాల జోలికి వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి రారు. మరో రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి మాత్రం అన్నింటికి దూరంగా ఉంటున్నారు. ఆయన రాజ్యసభ పదవి పొంది దాదాపు ఏడాది కావస్తుంది. అయినా పార్టీ కార్యాక్రమాల్లో పెద్దగా పాల్గొనింది లేదు. తన వ్యాపారాలకే అయోధ్య రామిరెడ్డి పరిమితమయ్యారు. కనీసం స్థానిక సంస్థల ఎన్నికలను కూడా అయోధ్య రామిరెడ్డి పట్టించుకోకపోవడం పట్ల గుంటూరు జిల్లాకు చెందిన వైసీపీ నేతలే తప్పుపడుతున్నారు.

# కరోనా ఆంక్షల పేరుతో ప్రజల రాక పోకలకు ఆటంకం కలిగించవద్దు

**- ఎమ్మెల్యే రెడ్డి శాంతి**

శ్రీకాకుళం కరోనా ఆంక్షల పేరుతో ప్రజల రాక పోకలకు ఆటంకం కలిగించవద్దని ఎమ్మెల్యే రెడ్డి శాంతి ఒడిషా అధికారులకు సూచించారు. శ్రీకాకుళం జిల్లాలో కరోనా ఆంక్షల పేరుతో ఒరిస్సా అధికారులు, ఆంధ్ర ఒడిస్సా సరిహద్దు గిరిజన గ్రామానికి పోయే రహదారిని జెసిబితో త్రవ్వి వేయడం వలన గ్రామస్థుల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. విషయం తెలిసిన పాతపట్నం నియోజక వర్గ శాసన సభ్యురాలు శ్రీమతి రెడ్డి శాంతి స్పందించి తక్షణమే పరిష్కరించమని జిల్లా అధికారులతో మాట్లాడారు. గ్రామ రహదారి వద్దకు వెళ్లిన ఎమ్మెల్యే ఒరిస్సా అధికారులతో సంబంధిత విషయంపై మాట్లాడి తక్షణమే ఆ గుంతను పూడ్చివేసి రహదారిని ఏర్పాటు చేసి గ్రామ ప్రజల రాకపోకలు జరిగేలా తక్షణ చర్యలు తీసుకోమని ఒరిస్సా కాధికారులను కోరారు. ఒరిస్సా అధికారులు ఈ విషయమై సానుకూలంగా స్పందిస్తూ రాకపోకలకు వీలుగా తక్షణమే చర్యలు చేపట్టారు. ప్రత్యేక ప్రవేశ దర్శనం తేదీలు మార్చుకునే అవకాశంతిరుమల ఆన్ లైన్లో 300 రూపాయల ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు బుకింగ్ తేదీలు మార్చుకునే అవకాశాన్ని టీటీడీ కల్పించింది. గత నెల 21 నుండి మే 31వ తేదీ వరకు ఆన్ లైన్ ద్వారా 300 రూపాయలు టికెట్లు పొందిన భక్తులకు బుకింగ్ పేజీలు మార్చుకునే అవకాశం ఇచ్చింది. సంవత్సరం లోపు ఒక్కసారి మాత్రమే బుకింగ్ తేదీలు మార్చుకునే అవకాశం వుంది.

# జీతాల కోసం అధ్యాపకుల అందోళన

కర్నూలు ఒక నెల కాదు, రెండు నెలలు కాదు, ఏకంగా సంవత్సరం పాటు అధ్యాపకులకు జీతాలు ఇవ్వని ప్రవేట్ కాలేజ్ యాజమాన్యం. అయినా సరే ఈనెల కాకపోయినా రేపు నెలలైనా మా జీతాలు ఇస్తారని పనిచేసిన అధ్యాపకులు. కరోన కష్ట కాలాలలో కూడా జీతాలు ఇవ్వకపోయినా పస్తులు వుండి విద్యార్థులకు పాఠాలు చెప్పిన అధ్యాపకులు. జీతాలు ఇవ్వక వేధిస్తున్న ప్రైవేట్ కాలేజ్ యజమాన్యం. మాకు జీతాలు ఇవ్వాలంటూ ఏఎస్ జూనియర్ కాలేజ్ ఆవరణంలో ఎనిమిది మంది అధ్యాపకులు నిరసన కు దిగారు. జీతాలు ఇవ్వాలంటూ కాలేజీ ముందు బైఠాయించారు. దీంతో కాలేజ్ కరస్పాండెంట్ గుర్రాల వెంకట్ రెడ్డి పెండింగ్లో ఉన్న జీతాలను వారం రోజుల్లో అధ్యాపకులకు చెల్లిస్తాను హామీ ఇచ్చారు. దీంతో అధ్యాపకులు నిరసనను విరమించారు.

# వాహనదారులకు పోలీసుల కౌన్సిలింగ్

ముమ్మిడివరం తూర్పు గోదావరి జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం ఐ పోలవరం మండలం ఎదురులంక జి ఎం సి బాలయోగి వారధి వద్ద 216 జాతీయ రహదారిపై అమలాపురం డీఎస్పీ వై మాధవ రెడ్డి ఆధ్వర్యంలో ముమ్మిడివరం సిఐ ఎం జానకి రామ్, ఐ పోలవరం ఎస్ ఐ కె రాము లాక్డౌన్ నేపధ్యంలో కరోనా నిబంధనలు పాటించని వారికి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. అత్యవసరమైన పరిస్థితిలో తప్ప ఏ ఒక్కరు లాక్ డౌన్ ఉ ల్లంఘించి బయటకు రావద్దని డి.ఎస్.పి హెచ్చరించారు. మధ్యాహ్నం 12 గంటల తర్వాత ప్రజలు రోడ్లపైకి రాకూడదని అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాలు సీజ్ చేయడం జరుగుతుందని డిఎస్పి హెచ్చరించారు.

# ఇళ్లకే పరిమితమయిన ప్రజలు

ఒంగోలు ప్రకాశం జిల్లాలో కర్ఫ్యూ ప్రశాంతంగా సాగింది. గత నాలుగురోజులకు భిన్నంగా జన నియంత్రణపై అధికారు లు దృష్టి సారించారు.తదనుగుణంగా ఉదయం 6 గంటల నుంచి 12 వరకు రోజు తెరిచే దుకాణాలు, ఇతర కార్యకలాపాలను నిలిపేశారు. ఉదయం నుంచే పోలీసు, మున్సిపల్ ఇతర శాఖల కీలక అధికారులు రోడ్డుపై తిరిగి పర్యవేక్షించగా పట్టణ ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఇక జిల్లాకేంద్రమైన ఒంగోలుతో పాటు ఇతర ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల వరకు సాధారణ కార్యకలా పాలు కొనసాగగా అనంతరం అన్నింటిని నిలిపేశారు.

# వంతెన కోసం ప్రజల డిమాండ్

విజయనగరం విజయనగరం జిల్లా పార్వతీపురం లో దీర్ఘకాల సమస్యగా ఉన్న పూర్ణపాడు - లాబేసు వంతెన పనులు వెంటనే ప్రారంభించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. వంతెన వద్ద నాగావళి నది దాటడం కోసం పూర్ణపాడు, లాబేసు గ్రామస్తులు గత కొన్నేళ్లుగా అష్టకష్టాలు పడుతున్నారు. వంతెన పనులు కోసం కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించడం, ఎన్నికలు అయిపోయిన తర్వాత మళ్లీ పనులు చేపడతామని చెప్పడం, మళ్లీ కొబ్బరికాయలు కొట్టడం పరిపాటిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. రెండు సంవత్సరాల కాలంలో ఒడిశా ప్రభుత్వం వనిజ గ్రామం వద్ద వంతెన పనులు తొంబై శాతం పూర్తి చేసిందని, మన ప్రభుత్వాలు మాత్రం 15 ఏళ్లు దాటినా పూర్ణపాడు పనులను డబ్బై శాతం కూడా పూర్తి చేయలేదని ఎద్దేవా చేశారు. వంతెన పనులు వేగంగా పూర్తి చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించినప్పటికీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా పనులు వదిలి వెళ్లిపోయారంటే కారణం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడం వల్లే కాంట్రాక్టర్ పనులు చేయడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వంతెన పనులను చేపట్టి గిరిజనుల ఇబ్బందులు తీర్చాలని డిమాండ్ చేశారు.

# టెన్షన్ పెడుతున్న ఫీవర్ సర్వే

హైదరాబాద్, మే 12, (న్యూస్ పల్స్)తెలంగాణలో చేసిన ఫీవర్ సర్వే సంచలన నిజాలు తెలిపింది. సెకండ్ వేవ్ పెద్దగా తీవ్రత చూపట్లేదని ప్రభుత్వం చెబుతున్నా.. క్షేత్ర స్థాయిలో నిజాలు భయాందోళన కలిగిస్తున్నాయి. రాష్ట్రంలో కరోనా లక్షణాలు ఎంతమందికి ఉన్నాయో గుర్తించడానికి ఫీవర్ సర్వే చేయించింది టీఆర్ఎస్ ప్రభుత్వం. కాగా ఈ సర్వే విస్తుపోయే నిజాలు తెలిపింది. ఈనెల 6నుంచి కరోనా లక్షణాలున్న వారిని గుర్తంచేందుకు ప్రభుత్వం ఫీవర్ సర్వేకు ఆదేశించింది. ఆశా కార్యకర్త, ఏఎఎన్ ఎం, గ్రామ పంచాయతీ లేదా మున్సిపాలిటీ నుంచి ఒకరు ఇలా నలుగురితో కలిపి కమిటీలు వేసింది. అయితే ఈ కమిటీలు కరోనా లక్షణాలున్న వారు రాష్ట్ర వ్యాప్తంగా లక్షల్లో ఉన్నట్టు గుర్తించింది. ఒక్క గ్రేటర్ హైదరాబాద్లోనే 31వేల మం



దికి జ్వరాలు, దగ్గు, జలుబు ఉన్నాయని చెప్పింది. అటు రాష్ట్ర వ్యాప్తంగా కూడా ముఖ్య నగరాల్లో కరోనా లక్షణాలు ఉన్న వారు లక్షల్లో ఉన్నట్టు విరవించింది. ప్రతి వంద మందిలో పది మందికి జ్వరం, దగ్గు లాంటివి ఉన్నాయని చెప్పింది.

# ఈటల పార్టీల కోసం పరుగులు

తిరుపతి, మే 12, (న్యూస్ పల్స్)ఈటెల పార్టీ పెడుతున్నారా.. ఇంకా ఫుల్ క్లారిటీ లేదు కదా. అప్పుడే పనులు మొదలెట్టడం ఏంటి అనుకోవచ్చు. కానీ.. అన్నీ బయటికి చెబుతారా ఏంటి. షర్మిల మాత్రం చెప్పారా. ఎవరు చెప్పారు మీకు.. ఎవరు చెప్పారు మీకు. నేను పార్టీ పెడతానని చెప్పానా.. మీ పాటికి మీరే ఊహించుకుంటారా అన్నారు. ఫైనల్ గా పార్టీ అన్నారు. ఇప్పుడు ఈటెల రాజేందర్ కూడా అంతే నాన బెడుతున్నారు. ఏ లీడరూ ఆయన్ని నేరుగా కలవడం లేదు. పార్టీల ఎవ్వారాలు మాట్లాడ్డం లేదు. కానీ.. గతంలో టీఆర్ఎస్ లో పని చేసిన మాజీ ఎంపీ.. కొండా విశ్వేశ్వర రెడ్డి మాజీ మంత్రి ఈటెలను మీట్ అయ్యారు. ఈటెల ఎటు స్టెప్ వేయబోతున్నారు.. పార్టీ పెట్టబోతున్నారా లేదా అన్న కన్ ఫ్యూజన్ అలాగే ఉన్న టైంలో.. కొండా విశ్వేశ్వర్ రెడ్డి మీట్ తో జనాలకి చాలా క్లారిటీస్ వచ్చాయి. కొండా గురించి తెలిసిందే కదా. తను ఎప్పుడు కొత్త పార్టీ స్టార్ట్ చేయాలా అని చూస్తున్నారు. తనే హెడ్డుగా ఉంటారా అనేది వదిలేస్తే.. అందరం కలిసి పార్టీ పెడదాం అనేది కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఆలోచన. ముందు నుంచే చెబుతున్నారు కదా. టీఆర్ఎస్ వ్యతిరేకంగా ఉన్న వారిని.. కేసీఆర్ ని వ్యతిరేకించిన వారిని ఒక్కటి చేస్తా అని ఎప్పటి నుంచో అంటున్నారు.ఇదే లిస్ట్ లో కొండాతో పాటు.. రేవంత్ రెడ్డి కూడా ఉన్నట్లు తెలుస్తోంది. రేవంత్ కొండా కలిసి పార్టీ పెడతారు అని విన్నాం. అలాగే ఈటెల కూడా కలిసి టీమ్ అప్ అవుతున్నారు అనే టాక్ బయటికి వచ్చింది. అదే టైంలో.. ఈటెల పై కేసీఆర్ అటాక్ చేశారు. ఇక కొండా మాత్రం వెనక్కి ఎందుకు తగ్గుతారు చెప్పండి. ఈటెలతో మీట్ అయ్యారు. చూస్తుంటే అనుకున్నట్లే అంతా ప్లాన్ ప్రకారం రన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ముగ్గురూ కలిసి.. టీమ్ అప్ అవుతున్నట్లే ఉంది. అలాగే.. ఈటెలతో పాటు.. ఎన్నికల టైంకి హరీశ్ రావు కూడా ఈ టీమ్ తో కలుస్తారు అనే టాక్ ఉంది. ఎవ్వారం సైలెంట్ గా నడుస్తున్నా.. పార్టీ పనులు మాత్రం స్పీడ్ గానే ఉన్నయ్ అనే టాక్ అయితే ఉంది.

# అనకాపల్లి ఎమ్మెల్యే గుడివాడ అమర్నాథ్ పిలుపుకు స్పందన

**రామ్ కో సిమెంట్ కర్మాగారం 20 లక్షల రూపాయలు విరాళం**

విశాఖపట్నం అనకాపల్లి శాసనసభ్యులు గుడివాడ అమర్నాథ్ పిలుపుకు అపూర్వ స్పందన లభించింది. అనకాపల్లి పట్టణంలోని జిల్లా ఆసుపత్రి అభివృద్ధికి రాంకో సిమెంట్ కర్మాగారం 20 లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అనకాపల్లి రింగ్ రోడ్డు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో 20 లక్షల రూపాయల చెక్కుని కర్మాగారం ప్రతినిధులు అనకాపల్లి గౌరవ శాసనసభ్యులు గుడివాడ అమర్నాథ్ గారి చేతుల మీదగా ఆసుపత్రి సూపర్డెంట్ శ్రావణ్ కుమార్ గారికి అందజేశారు. ఈ సందర్భంగా అమర్నాథ్ మాట్లాడుతూ హాస్పిటల్ అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు తన తండ్రి గుడివాడ గురునాధరావు గారి ట్రస్టు తరపున అమ్మగారు గుడివాడ నాగమణి గారి పేరిట అమర్నాథ్ గారి సొంత నిధుల నుండి 5 లక్షలు రూపాయలు అందజేశామన్నారు. అలాగే అమర్నాథ్ గారి పిలుపు మేరకు లారెన్స్ సంస్థ కూడా ఆసుపత్రి అభివృద్ధికి రూ 5 లక్షల రూపాయలు ఇచ్చిందన్నారు. అమర్నాథ్ గారి విజ్ఞప్తి మేరకు రాంకో సిమెంట్ కర్మాగారం యాజమాన్యం కూడా ఆసుపత్రికి బుధవారం 20 లక్షల రూపాయలు అందజేసిందని ఆయన చెప్పారు. ప్రస్తుతం ఆసుపత్రిలో 85 ఆక్సిజన్ పడకలు అందుబాటులో ఉన్నాయన్నారు. అత్యవసర పరిస్థితికి అనుగుణంగా మరో పదిహేను ఆక్సిజన్ పడకలను సిద్ధం చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రాంకో కర్మాగారం యాజమాన్యం సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.రాంకో కర్మాగారం జి ఎం రామ సుబ్రహ్మణ్యన్ మాట్లాడుతూ శాసనసభ్యులు గుడివాడ అమర్నాథ్ గారి విజ్ఞప్తి మేరకు తమ యాజమాన్యం ఆసుపత్రి అభివృద్ధికి 20 లక్షల రూపాయలు అందజేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో జిక్కుల సీతారామారావు, వైకాపా పట్టణ శాఖ అధ్యక్షులు మందపాటి జానకి రామ రాజు, మండల పార్టీ అధ్యక్షులు గొర్లి సూరి బాబు, వైకాపా నాయకులు పీలా రాంబాబు, కొణతాల భాస్కర్, పలకా రవి, ఆళ్ళ నాగేశ్వరరావు, రాంకో కర్మాగారం ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ

నెల్లూరు నెల్లూరు జిల్లా గూడూరు పట్టణంలోని నరసింగరావు పేట మదరసా మసీదు ప్రాంతంలో సీనియర్ జర్నలిస్టు మీరా మోహిద్దీన్ ఆధ్వర్యంలో, రంజాన్ పండుగను పురస్కరించుకుని పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఆలిండియా ఎస్సీ ఎస్టీ బిసి మైనారిటీ యునైటెడ్ ఫోరం జాతీయ ఉపాధ్యక్షులు వేగూరు.విజయ్ కుమార్ , బహుజన సమాజ్ పార్టీ నాయకులు నాసిన,భాస్కర్ గౌడ్ తదితరులు హాజరై వారి చేతుల మీదుగా పలువురు పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు వేగూరు.విజయ్ కుమార్ మాట్లాడుతూ భారతదేశంలో దాదాపు 30 కోట్ల మంది ముస్లింలు ఉన్నారని వారు దేశంలో ఒక భాగమై సేవ చేస్తున్నటువంటి మహనీయులు ముస్లింలు అని కొనియాడారు. ఈ కరోనా కష్టకాలంలో పేద ముస్లింలు సంతోషంగా రంజాన్ పండుగ జరుపుకోవాలనే ఉద్దేశంతో రంజాన్ తోఫా పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. కరోనా వైరస్ కారణంగా ఇటీవల మృతి చెందిన వారిని ఖననం చేసేందుకు చాలా మంది ముస్లిం యువత ముందుకు వచ్చి సేవా కార్యక్రమాలు చేస్తున్నారని ఈ క్రమంలో గూడూరు పట్టణానికి చెందిన ఈద్గా యూత్ సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కొనియాడారు. ముస్లిం సోదర సోదరిమణులకు గర్వం కలిగించే విధంగా , దేశభక్తిని పెంపొందించే విధంగా సేవ చేస్తున్నారని ఈద్గా యూత్ సంస్థ వారికి ఈ సందర్భంగా సలాం చేస్తున్నామని వేగూరు.విజయ్ కుమార్ కొనియాడారు. ముస్లింలు అందరికీ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.బహుజన సమాజ్ పార్టీ నాయకులు నాసిన.భాస్కర్ గౌడ్ మాట్లాడుతూ దాదాపు ఎనిమిది వందల సంవత్సరాలు భారతదేశాన్ని ముస్లింలు పాలించారని , సేవలందించారని ఆయన గుర్తు చేశారు.ముస్లింలు అందరూ సంతోషంగా

రంజాన్ పండుగ జరుపుకోవాలని ఈ సందర్భంగా ముస్లింలు అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నామని చెప్పారు. కరోనా మృతదేహాలకు దహన సంస్కారాలు నిర్వహిస్తున్న ఈద్గా యూత్ సంస్థ వారికి ఈ సందర్భంగా ఆయన అభినందనలు తెలియజేశారు. అనంతరం ముస్లిం నాయకులు సీనియర్ జర్నలిస్టు , జిల్లా వార్త ఎడిటర్ మీరా మోహిద్దీన్ మాట్లాడుతూ ప్రతి ఏడాది ఏడాది క్రమం తప్పకుండా రంజాన్ పండుగ పురస్కరించుకుని పేద ముస్లిం లకు తమ వంతుగా రంజాన్ తోఫా పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫైజుద్దీన్ , నిజాముద్దీన్ , ఖమరున్నీసా , షనీషున్నీసా , షేక్.జానీ తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ (ఈద్-ఉల్-ఫితర్) పండుగ శుభాకాంక్షలు....

**రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అంజద్ బాష...**

కడప, మే 12 రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి వర్యులు అంజద్ బాష ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ (ఈద్ ఉల్ ఫితర్) పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూప్రపంచ వ్యాప్తంగా కరోనా మహమ్మారి సృష్టిస్తున్న భయాందోళనల మధ్య గత ఏడాది రంజాన్ పండుగ కేవలం ఇళ్ల వరకేపరిమితమయిందన్నారు. ఈ సంవత్సరం అల్లాహ్ దయ మరియు ప్రభుత్వ తోడ్పాటుతో, పరిమిత సంఖ్యలో సామాజికదూరాన్ని పాటిస్తూ, ముస్లిం సోదరులు తమ మసీదులో ప్రార్ధనలు జరుపుకోవచ్చని తెలిపారు.రాష్ట్ర ప్రజలు కరోనా మహమ్మారికి బలికాకుండా ఉండేందుకు, రాష్ట్ర ముఖ్య మంత్రి వర్యులు శ్రీ వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ పరంగా అన్ని రకాల చర్యలు చేపడుతూ, కరోనా కట్టడికి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. భారతదేశంలోనే, కరోనా బాదిత రోగులకు ఆరోగ్యశ్రీ పదకం కింద ఉచిత చికిత్సలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వంఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అన్నారు.,కరోనా వ్యాప్తిని అరికట్టేందుకు ఈనెల 5వ తేదీ నుండి 15 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా 144 సెక్షన్ అమలు చేస్తూ కర్ఫ్యూ విదించడమైనదని తెలిపారు. ఇలాంటి విపత్కర పరిస్థితులలో రంజాన్ (ఈద్-ఉల్- ఫితర్) పండుగ జరుపుకోబోతున్నామని ఈ సందర్భంగా 1400 సంవత్సరాల క్రితం మొహమ్మద్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ప్రవచించిన హదీసు ను ముస్లిం7 సోదరసోదరీమణులు అందరూ గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అదేంటంటే, "ఏదైనా ప్రాంతంలో అంటువ్యాది ప్రబలిన సమాచారం అందితే, మీరు ఆ ప్రాంతానికి ప్రయాణం చేయరాదు. అలాగే, మీరు ఉంటున్న ప్రాంతంలోనే అంటువ్యాధి ప్రబలితే, మీరు మీ ఇళ్లకే పరిమితం కావాలని తెలియజేశారన్నారు. కరోనా మహమ్మారి ప్రబలంగా వ్యాపిస్తున్న నేపధ్యంలో ప్రజల ప్రాణ రక్షణ ప్రాదాన్యతగా పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం11 న ప్రత్యేక విధివిధానాలను జారీ చేయడమైనది తెలిపారు. ఆ మేరకు ఈద్గా/ ఖాళీ ప్రదేశాలలో ఈద్-ఉల్- ఫితర్ సామూహిక నమాజులు పూర్తిగా నిషేధించడమైనదని తెలిపారు. అనీలతిట-19 ప్రోటోకాల్ మేరకు ఆరోగ్యవంతమైన వారు పండుగ దినాన ఉదయం 12 గంటల లోపు పరిమిత సంఖ్యలో (50 మంది మాత్రమే) మసీదులలో ప్రార్ధనలు జరుపుకోవచ్చునని తెలిపారు. అలాగే రాష్ట్రంలోని ముస్లిం సోదరసోదరీమణులందరు, ప్రభుత్వం సూచించిన విధివిధానాలను తూచ తప్పకుండా పాటిస్తూ, స్థానిక ప్రభుత్వ యంత్రాంగానికిసహకరిస్తూ, ప్రభుత్వానికి తోడ్పాటు అందించాలన్నారు. మన భారతదేశం నుండి కరోనా మహమ్మారి వైదొలగాలని,ప్రజలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేయాలని అల్లాహ్ ను ప్రార్ధించాలని కోరారు .ఈద్-ఉల్- పితర్ పండుగను ఆరోగ్యకర వాతావరణంలో, సుఖ సంతోషాలతో జరుపుకోవాలని, ఆయన ఆకాంక్షించారు. కరోనా సెకండ్ వేవ్ కొనసాగుతున్నందున రంజాన్ పండుగ నిర్వహణపై ప్రభుత్వ ఉత్తర్వులు జి.ఓ.ఆర్.టి.నెం.51, మైనారిటీ సంక్షేమ శాఖ, ద్వార జారిచేయబడిన మార్గనిర్దేశకాలు:।1.ఈద్గాలు, బహిరంగ ప్రదేశాల్లో ఈద్-ఉల్-ఫితర్, సామూహిక నమాజ్ లు పూర్తిగా నిషేధం. 2. ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ మసీదులలోనే జరుపుకోవాలి. 3.రంజాన్ రోజున మసీదుల్లో జరిగే ప్రార్ధనల్లో 50 మందికి మించి పాల్గొనకూడదు. 4. ప్రార్ధనల్లో పాల్గొనే వారు మాస్క్ ధరించి కనీసం ఆరు అడుగుల భౌతిక దూరం పాటించాలి. 5.మాస్క్ లేకుండా మసీదుల్లోకి ప్రవేశం లేదు. 6. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య రెండు విడతల్లో 50 మంది చొప్పున ప్రార్ధనలు చేసుకోవచ్చు. 7.ప్రార్ధనలకు ముందు నిర్వహించే వజూను ఇళ్ల వద్దే పూర్తి చేసుకోవాలి. 8.నేలపై కూర్చునేందుకు మేట్లను(జనిమజ్) ఇంటినుంచి తెచ్చుకోవాలి. 9.మసీదు ప్రవేశ ద్వారం వద్ద తగిన సంఖ్యలో శానిటైజర్ను అందుబాటులో ఉంచి ప్రతి ఒక్కరి చేతులు శానిటైజర్ తో శుభ్రం చేసుకునే విధంగా ఏర్పాట్లు చేయాలి10.టెంపరేచర్ చెక్ చేసిన తర్వాతే మసీదులో అనుమతించాలి. 11.వృద్ధులు,పిల్లలతో పాటు దగ్గు,జలుబు, జ్వరం, మధుమేహం, హై బీపీ, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడే వారు ఇళ్ల వద్దే ప్రార్ధనలు చేసుకోవాలి. 12.నమాజు చదివించే ఇమామ్ లు వారి సందేశాలను కుదించి త్వరగా ముగించాలి. 13.ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకునేందుకు చేతులు కలపడం, ఆలింగనం చేసుకోవడం వంటి వాటికిదూరంగా ఉండాలి.

# జగన్ కు ప్రధాని పదవి ఆశ వుంది

విజయవాడ రాష్ట్రంలో కరోనా మరణాలు ఎంపి రఘురామకృష్ణ రాజు ఆందోళన వ్యక్తం చేశారు. విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ కొంతమంది ప్రతిపక్ష నాయకుల పైన రాష్ట్ర ప్రభుత్వం పెట్టించిన అక్రమ కేసులు,పలు ఇతర ముఖ్య అంశాలపై ప్రస్తావించిన ఆయన రాజధాని రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి జగన్ పై వైసీపీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణరాజు మరోసారి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. జగన్ కు ఈ దేశ ప్రధాని కావాలనే ఆశ ఉందని ఆయన అన్నారు. ప్రజలు ప్రాణాలు కోల్పోతుంటే పట్టించుకోకుండా... కూడబెట్టిన డబ్బులతో ప్రధాని కావాలనుకుంటున్నారని... ఆయన కోరికను పైనున్న దేవుళ్లు, ఆయన నమ్మిన ఏసు క్రీస్తు కూడా అంగీకరించరని వ్యాఖ్యానించారు. కరోనా బాధితులకు రాష్ట్రంలో తీరని అన్యాయం జరుగుతోందని చెప్పారు. ఏపీలోని ఆసుపత్రుల్లో కోవిడ్ బాధితులకు తీరని అన్యాయం జరుగుతోందని... ఈ అరాచకాలను పట్టించుకునే వారే లేరని రఘురాజు మండిపడ్డారు. కేవలం జగన్ నిర్లక్ష్యం వల్లే 46 మంది పేషెంట్లు చనిపోయారని ఆరోపించారు. మృతుల కుటుంబాలకు రూ. 10 లక్షలు ఇస్తున్నామంటూ జగన్ చేసిన ప్రకటనపై కూడా ఆయన మండిపడ్డారు. జగన్ ఏమైనా ఆయన జేబులో నుంచి డబ్బులు ఇస్తున్నారా? అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్న వారిపై కేసులు పెడుతున్నారని... ఈ కేసులను జగన్ పై పెట్టాలని రఘురాజు అన్నారు. కరోనా లెక్కలపై కూడా ప్రభుత్వం తప్పుడు లెక్కలు చెపుతోందని దుయ్యబట్టారు. కేసులు విపరీతంగా పెరిగిపోతుంటే లాక్ డౌన్ పెట్టకుండా... కర్ఫ్యూ పెట్టడమేంటని ఎద్దేవా చేశారు. ప్రజల ప్రాణాలు, శవాలతో వ్యాపారం చేయడం అత్యంత దారుణమని అన్నారు.

# నిరుపేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ

నందికొట్కూరు. మే 12 పట్టణంలో సిపిఐ జిల్లా నాయకులు రఘురామ్ మూర్తి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయం వద్ద పట్టణ ఏఐటీయూసీ నాయకులు కొంగర సతీష్ బాబు ఆర్థిక సహకారంతో పట్టణంలోని నిరుపేద ముస్లిం కుటుంబాలకు ఐదు రకాల వస్తువులతో కూడిన రంజాన్ తోఫా ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రఘురామ్ మూర్తి మాట్లాడుతూ పట్టణ ఏఐటీయూసీ నాయకులు సతీష్ బాబు తన సొంత ఖర్చుతో రూ 40 వేల రూపాయల ను వెచ్చించి పట్టణంలోని నిరుపేద ముస్లింలతో పాటు పలువురు నిరుపేద కుటుంబాలకు ఐదు రకాల నిత్యావసర సరుకుల తో కూడిన కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం తన సొంత ఖర్చులతో నిత్యావసర సరుకుల ను అందచేసిన సతీష్ బాబును ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఏ ఐ టి యు సి నాయకులు పోచయ్య, మున్నా, మౌలాలి, ఏపీ మహిళా సమాఖ్య నాయకులు దానమ్మ, అక్కమ్మ , జయమని, శాలి బి తదితరులు పాల్గొన్నారు.

# ఆగని మందు పిచ్చి



హైద్రాబాద్, మే 12, (న్యూస్ పల్స్)తెలంగాణ రాష్ట్రంలో అబ్కారీ శాఖకు వచ్చే ఆదాయం గురించి తెలిసి ఈ దేశమే షాక్ అవుతూ ఉంటుంది. ఎందుకంటే మందుబాబులు తెలంగాణలో కోట్లలో ఆదాయాన్ని తీసుకుని వస్తున్నారు. తాజాగా తెలంగాణలో 10 రోజుల పాటూ లాక్ డౌన్ ను అనౌన్స్ చేయడంతో ఒక్కసారిగా మద్యం షాపుల ముందు భారీగా క్యూ కట్టేశారు. వైన్స్ షాపుల వద్ద మద్యం బాబులు బారులు తీరారు. మద్యం దుకాణాల వద్ద రద్దీ పెరిగింది. రాష్ట్రంలో మళ్లీ లాక్ డౌన్ విధించినట్లు ప్రకటన వెలువడిన కొద్ది నిమిషాల వ్యవధిలోనే మందు బాబులు ముందస్తుగానే మద్యం కొనుక్కుని ఇంట్లో పెట్టుకోవడానికి ప్రయత్నాలు మొదలు పెట్టారు. మద్యం దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. అటు వ్యాపారులు, ఇటు కొనుగోలుదారులు కోవిడ్ నిబంధ నలు పాటించడం లేదు. అధికారులు ఆంక్షలు విధించినప్పటికి షాపుల వద్ద వీటిని ఎవరూ పట్టించుకోవడంలేదు. తెలంగాణలో లాక్డౌన్ విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పదిరోజుల పాటు ఈ లాక్డౌన్ కొనసాగనుంది. ప్రతిరోజు ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు మాత్రం లాక్డౌన్ నుంచి మినహాయింపు ఇచ్చారు. నిత్యవసరాలు, ఇతర వస్తువుల కొనుగోలుకు ఈ సమయంలో వెసులుబాటు కల్పించారు. ఉదయం 10 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు లాక్డౌన్ అమలు కానుంది. ఈ సమయంలో దాదాపు అన్ని కార్యకలాపాలు నిలిచిపోనున్నాయి. అత్యవసర సేవలను మాత్రమే అనుమతించనున్నారు. హఠాత్తుగా లాక్ డౌన్ విధించడంపై తెలంగాణ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక్కసారిగా రేపటి నుంచి లాక్ డౌన్ అని ప్రకటిస్తే... ఇంత తక్కువ సమయంలో ఇతర రాష్ట్రాల ప్రజలు వారి స్వస్థలాలకు ఎలా వెళ్తారని హైకోర్టు ప్రశ్నించింది. గత ఏడాది లాక్ డౌన్ వల్ల లక్షలాది మంది వలస కార్మికులు ఎన్నో ఇబ్బందులు పడగా.. ఈసారి అలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ ను విచారిస్తూ రాష్ట్ర ప్రభుత్వంపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. రోజువారీ కూలీ చేసుకుంటూ బతుకుతున్న వలస కార్మికుల కోసం ప్రభుత్వం ఏం చేస్తోందని ప్రశ్నించగా.. దీనికి సమాధానంగా ఇప్పటికే 50 శాతం మంది వలస కార్మికులు వాళ్ల సొంతూళ్లకు వెళ్లిపోయారని కోర్టుకు ఏజీ తెలిపారు. లాక్ డౌన్ సమయంలో సాయంత్రం వేళల్లో ఎలాంటి సడలింపులు ఉండవని ఏజీ చెప్పారు.

# వైద్య సామాగ్రి పంపిణి చేసిన ఎమ్మెల్యే రోజా

నగరి కరోనా విపత్తు సమయంలో నగిరి ఎమ్మెల్యే, ఏపీఐఐసీ ఛైర్మన్ రోజా పేదలకు వైద్యానికి అవసరమైన సామగ్రిని తన వంతు సహాయంగా సమకూర్చారు. నగిరి, పుత్తూరు ఆస్పత్రులలో వైద్యులకు, సిబ్బంది అవసరమైన మెటిరియల్ తో పాటు ఆస్పత్రులలో పేదలకు వైద్యం అందించేందుకు అవసరమైన మెటిరియల్ ను రోజా చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందించారు ఎమ్మెల్యే రోజా. ఆమె ప్రస్తుతం ఆమెకు ఆపరేషన్ అయినందున విశ్రాంతిలో ఉన్నారు. సహాయాన్ని తన భర్తే ఆర్కే సెల్వమణి ద్వారా పంపిణీ చేయించారు. నగిరి ఆస్పత్రికి అవసరమైన వాషింగ్ మెషీన్, కుర్చీలు, డాక్టర్లకు టోపీలు, గ్లౌజులు, బ్లీచింగ్ పౌడర్, సోడియం హైపోక్లోరైట్ సొల్యూషన్, స్ప్రే మెషీన్లు, ఆక్సిజన్ కాన్సనట్రేటర్లు, శానిటైజర్లు, ఎన్ 95 మాస్కులు, స్టేషనరీతో సహా అవసరమైన మెటీరియల్ ను అందించారు. పుత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి హెమటాలజీ అనలైజర్, సెమీ ఆటో ఎనలైజర్, శానిటైజర్లు, పీపీ ఈ కిట్లు, ఎన్ 95 మాస్కులు, సోడియం హైపోక్లోరైట్ సొల్యూషన్ ను పంపిణీ చేశారు.

# 21, 22 అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

విజయవాడ, మే 12, ( విభారె) ఏపీ అసెంబ్లీ సమావేశాలు నిర్వహించే యోచనలో ఉంది జగన్ సర్కార్. ఈ నెల 21, 22 నుంచి సమావేశాలు నిర్వహించాలని భావిస్తున్నారు. ఎన్ని రోజులు సెషన్స్ నిర్వహించాలన్న అంశంపై బీఏసీ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోనున్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వం నుంచి అధికారికంగా ప్రకటన విడుదల కావాల్సి ఉంది. అయితే ఒక్కరోజే అసెంబ్లీ నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది.వాస్తవానికి మార్చిలో ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించాల్సి ఉంది. కరోనా, ఎన్నికల కారణంగా సాధ్యపడలేదు.. దీంతో మార్చి నెలాఖరులో బడ్జెట్ ఆర్డినెన్సుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మూడు నెలల కాలానికి ఏపీ బడ్జెట్ ఆర్డినెన్స్‌ను రూపొందించారు. రూ.80వేల కోట్ల నుంచి రూ.90వేల కోట్ల వరకు మూడు నెలల బడ్జెట్ ఉంటుంది. ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు, నవరత్న పథకాల అమలుకు ఈ నిధులు వినియోగిస్తారు. వరుసగా రెండో ఏడాది ఆర్డినెన్స్ రూపంలో బడ్జెట్‌ను రూపొందించారు. మూడు నెలల సమయం ముగియనుండటంతో అసెంబ్లీ సమావేశాలు నిర్వహించి బడ్జెట్ ప్రవేశపెట్టాలని భావిస్తున్నారు.వాస్తవానికి మార్చి నెలలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించి.. బడ్జెట్‌ను ప్రవేశపెట్టి ఆమోదించాల్సి ఉంది. ఈ నెల మూడో వారం, నెలాఖరులో సెషన్ నిర్వహించాలని భావించారు. కానీ వరుసగా ఎన్నికలు రావడం, కరోనా కేసులు పెరగడం, తిరుపతి లోక్‌సభకు ఉప ఎన్నిక ఉండటంతోనే ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చించింది. గతేడాది కూడా కరోనా కారణంగా బడ్జెట్ ఆర్డినెన్స్ తీసుకొచ్చారు. ఈ ఏడాది కూడా మళ్లీ అదే రిపీట్ అయ్యింది.

## కోవిడ్ మేనేజ్మెంట్, వాక్సినేషన్ కార్యక్రమంపై అధికారులతో సమీక్ష సమావేశం

నెల్లూరు( విభారె) నగరంలోని కలెక్టరేట్ ప్రాంగణంలోని తిక్కన భవన్ నందు బుధవారం రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి మేకపాటి గౌతంరెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి పోలుబోయిన అనిల్ కుమార్, జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్ బాబు కోవిడ్ మేనేజ్ మెంట్, వ్యాక్సినేషన్ కార్యక్రమంపై కోవిడ్ టాస్క్ ఫోర్స్ అధికారులు, నోడల్ అధికారులతో సమీక్షా, సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగారాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి మేకపాటి గౌతంరెడ్డి మాట్లాడుతూ, మొదటి వేవ్ లోని కోవిడ్ వ్యాధి లక్షణాలకు, మరణాలకు, రెండో వేవ్ లో నమోదవుతున్న వ్యాధి లక్షణాలు, మరణాలకు ఎంతో వ్యత్యాసం ఉందని అన్నారు. జిల్లాలో ఎన్ని నోటిఫైడ్ కోవిడ్ ఆస్పత్రులు ఉన్నాయి..? నోటిఫైడ్ కోవిడ్ ఆస్పత్రుల్లో ఎన్ని ఆక్సిజన్..? ఎన్ని ఐ.సి.యు..? బెడ్స్ అందుబాటులో ఉన్నాయి..? అనే వివరాలు జిల్లా కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్ బాబు, టాస్క్ ఫోర్సు అధికారులను అడిగి మంత్రి తెలుసుకున్నారు. రోగులకు అందించడానికి ప్రతిరోజూ ఎన్ని మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ అవసరం అవుతోంది..? ప్రస్తుతం ఎంత ఆక్సిజన్ జిల్లాకు సరఫరా అవుతోంది.. ? అనే వివరాలు అడిగి తెలుసుకున్న పరిశ్రమల శాఖామంత్రి.., కర్ణాటక, తమిళనాడు ప్రభుత్వాలతో మాట్లాడి ఆ కొరతను భర్తీ చేసే విధంగా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కోవిడ్ రోగులకు చికిత్స అందించడానికి ఒకేచోట బెడ్స్ ఎక్కువ ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులకు తెలిపారు. ప్రతిరోజూ ఎన్ని మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ అవసరం, ఆస్పత్రుల్లో ఆక్సిజన్ కొరత ఉందా..? అనేది ఎప్పటికప్పుడు అధికారులు పరిశీలించాలన్నారు. ఆక్సిజన్ కొరత రాకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి రాష్ట్రానికి అవసరమైన ఆక్సిజన్ గురించి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మాట్లాడారని.., కోవిడ్ రోగులకు ఆక్సిజన్ కొరత లేకుండా ప్రభుత్వం, జిల్లా అధికారులు అహర్నిసలు పనిచేస్తున్నారని.., ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్, జిల్లా యంత్రాగాన్ని అభినందించారు. ఈ సందర్భంగారాష్ట్ర జల వనరుల శాఖామంత్రి పోలుబోయిన అనిల్ కుమార్ మాట్లాడుతూ నెల్లూరు జి.జి.హెచ్ ఆస్పత్రిలో ఐ.సి.యు రూం నందు పనిచేస్తున్న జూనియర్ వైద్యులకు అధిక పనిగంటలు సమయం కేటాయిస్తున్నారని.., దానివలన వారు విధులు నిర్వర్తించలేకపోతున్నారన్నారు. ఐ.సి.యు లో పనిచేసే వారికి రోజుకి 8 గం. చొప్పున షిఫ్ట విధానంలో డ్యూటీలు కేటాయించాలన్నారు. కొన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో రోగులకు బెడ్స్ కేటాయించడంలో నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని, జిల్లా కలెక్టర్ దృష్టికి మంత్రి తీసుకువచ్చారు. అలాంటి ఘటనలు ఏమైనా జరిగితే తప్పక చర్యలు తీసుకుంటామని మంత్రికి తెలిపిన కలెక్టర్.., నోటిఫైడ్ కోవిడ్ ఆస్పత్రుల్లో విధులు నిర్వహిస్తున్న నోడల్ అధికారులు వారికి కేటాయించిన ఆస్పత్రిలో పరిశీలించి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పేదలు ఆస్పత్రికి వచ్చినప్పుడు వెంటనే వారికి తగిన చికిత్స అందించాలని, ఆక్సిజన్ అందించడంలో ఆలస్యం చేసినా..? రెమిడిస్ వేర్ వంటి మందులు అందించడం ఆలస్యం అయినా..? రోగి పరిస్థితి విషమిస్తోందని.., ఈ లోటుపాట్లు లేకుండా జిల్లాలో కోవిడ్ రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు. నిబంధనలు ఉల్లఘించి జి.జి.హెచ్. లో బెడ్స్ కేటాయింపులు జరిగాయనే విషయాన్ని తెలిపిన మంత్రి, దీనికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని జి.జి.హెచ్.సూపరింటెండ్ ని ఆదేశించారు. దీనిపై స్పందించిన కలెక్టర్ కె.వి.ఎన్.చక్రధర్ బాబు.., ఎస్పీకి ఫిర్యాదు చేయాలని జి.జి.హెచ్. సూపరింటెండెంట్ ని ఆదేశించారు. అనంతరంజిల్లా కలెక్టర్ కె.వి.ఎన్. చక్రధర్ బాబు మాట్లాడుతూ, జిల్లాలోని 38 కోవిడ్ నోటిఫైడ్ ఆస్పత్రులకు 332 ఐ.సి.యూ బెడ్స్, 1343 ఆక్సిజన్ బెడ్స్, 1076 నాన్ ఆక్సిజన్ బెడ్స్ లో చికిత్స అందించడానికి అనుమతి ఇచ్చామన్నారు. ఇప్పటికే జి.జి.హెచ్..., నారాణయ, కిమ్స్, అపోలో ఆస్పత్రితో పాటు.., నోటిఫైడ్ కోవిడ్ ఆస్పత్రుల్లోని రోగులకు చికిత్స అందించడానికి ప్రతిరోజూ.., 36.5 మెట్రిక్ టన్నుల ఆక్సిజన్ వినియోగిస్తున్నామన్నారు. తమిళనాడు నుంచి సరఫరా అవ్వాల్సిన ఆక్సిజన్ సమయానికి అందకపోవడం వలన.., కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నామని.., కర్ణాటక, వైజాగ్, ఇస్రో నుంచి ఆక్సిజన్ అత్యవసరంగా తీసుకుని వచ్చి.., రోగులకు ఆక్సిజన్ అందించామని మంత్రికి తెలిపారు. రోజు రోజుకూ పాజిటివ్ కేసుల సంఖ్య పెరుగుతున్నందువలన.., జిల్లాకు సరఫరా అవుతున్న ఆక్సిజన్ సరిపోవడం లేదని.., ఆక్సిజన్ కొరతను భర్తీ చేయడానికి రాష్ట్ర పరిశ్రమల శాఖామంత్రి మేకపాటి గౌతంరెడ్డి, రాష్ట్ర జలవనరుల శాఖామంత్రి పోలుబోయిన అనిల్ కుమార్ తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రులు జిల్లాకు అవసరమైన ఆక్సిజన్ ను అందించే ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగాఎస్పీ భాస్కర్ భూషణ్ మాట్లాడుతూ, మొదటి వేవ్ కోవిడ్ వచ్చినప్పుడు విధులు నిర్వహిస్తూ ఇద్దరు పోలీసులు, రెండో వేవ్ లో విధులు నిర్వహిస్తూ 7 పోలీసులు మరణించారని, అందువల్ల పోలీసులతో పాటు ఫ్రంట్ లైన్ వర్కర్లుగా పనిచేస్తున్న అందరికీ మెరుగైన వైద్యం అందించాలని కోరారు.

# కరోనా నుండి మిమ్మల్ని రక్షించడానికి 'ఈ' ఆహారాలు ముఖ్యమైనవి ... ఎందుకో తెలుసా?



కరోనా రెండవ తరంగం దేశవ్యాప్తంగా వేగంగా వ్యాపించడంతో, ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ప్రజలు రోగనిరోధక శక్తిని పెంచడానికి మరియు ఆరోగ్యంగా ఉండటానికి పోషకమైన ఆహారాన్ని తీసుకుంటారు. ఆ మాటకొస్తే, మన శరీరానికి ప్రోబయోటిక్ ఆహారాలు ముఖ్యమైనవి. జీర?వ్యవస్థను పెంచే, పోషక శోషణకు మద్దతు ఇచ్చే మరియు రోగనిరోధక వ్యవస్థకు తోడ్పడే మంచి బ్యాక్టీరియా వాటిలో ఉండటం దీనికి కారణం. కరోనా చికిత్సలో అధిక స్థాయిలో యాంటీబయాటిక్స్ తీసుకోవడం మనందరికీ తెలుసు.నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఈ యాంటీబయాటిక్స్ జీర?వ్యవస్థలో అవసరమైన బ్యాక్టీరియా సంఖ్యను బాగా తగ్గిస్తుంది మరియు కడుపు నొప్పి, మలబద్ధకం మరియు మంట వంటి ఇతర రుగ్మతలకు కారణమవుతుంది. మీ రోజువారీ ఆహారంలో ప్రోబయోటిక్ ఆహారాలను చేర్చడం చాలా ముఖ్యం. ఎందుకంటే అవి పేగు ఆరోగ్యాన్ని పెంచడమే కాక రోగనిరోధక శక్తిని పెంచడంలో కూడా సహాయపడతాయి. కోవిడ్ -19 రికవరీలో ప్రోబయోటిక్ ఆహారాలు ఎందుకు ముఖ్యమైనవో ఈ వ్యాసంలో మీరు కనుగొంటారు.పేగు ఆరోగ్యానికి పెరుగు మీకు ఉత్తమమైన ఆహారం. పెరుగు గరిష్ట ప్రయోజనాలను పొందడానికి ఉత్తమ మార్గం. ఇది పేగు ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాక, ఎముకల ఆరోగ్యాన్ని మెరుగుపర్చడానికి కూడా సహాయపడుతుంది. ప్రకోప ప్రేగు సింద్రోమ్ లక్షణాలను తొలగించడంలో ఇది చాలా ప్రభావవంతంగా ఉంటుంది.ఇది పులియబెట్టిన కొరియన్ వంటకం. ఇది క్యాబేజీ, మిరప, వెల్లుల్లి, అల్లం, ఉప్పు మరియు స్కాలియన్లను ఉపయోగిస్తుంది. మరియు అవన్నీ కలిసి జీర? ఆరోగ్యానికి పోషకాల యొక్క మంచి వనరుగా ఏర్పడతాయి. వాటిలో లాక్టోబాసిల్లస్ కిమ్చి కూడా ఉంటుంది, ఇది గౌట్ కు ఆరోగ్యకరమైనది.ఇంట్లో తయారుచేసిన పాలవిరుగుడు ప్రోబయోటిక్స్ కు మరొక గొప్ప మూలం. దీనిని తరచుగా 'గ్రానీ ప్రోబయోటిక్' అని పిలుస్తారు. ఇది కొవ్వు తక్కువగా ఉంటుంది మరియు అవసరమైన విటమిన్లు మరియు బి 12, రిబోఫ్లేవిన్, కాల్షియం మరియు భాస్వరం వంటి ఖనిజాలను కలిగి ఉంటుంది. రోగనిరోధక వ్యవస్థ త్వరగా కోలుకోవడానికి అవి అవసరం.కొంబుచా ప్రోబయోటిక్ లక్షణాలతో పులియబెట్టిన నలుపు లేదా గ్రీన్ టీని సూచిస్తుంది. ఇది స్నేహపూర్వక బ్యాక్టీరియా మరియు ఈస్ట్ కలిగి ఉంటుంది మరియు పేగు ఆరోగ్యానికి మంచిది.ఊరగాయలు మనం ఇంట్లో తయారుచేసే మసాలా ఊరగాయలు కాదు. ఉప్పు మరియు నీటి ద్రావణంలో ఊరగాయ చేసే దోసకాయలు ఇవి. ఈ ప్రక్రియ వాటిని పుల్లని చేస్తుంది మరియు జీర? ఆరోగ్యాన్ని మెరుగుపరిచే ఆరోగ్యకరమైన ప్రోబయోటిక్ బ్యాక్టీరియా అదుతేమైన మూలం. ఇవి కేలరీలు తక్కువగా ఉంటాయి మరియు విటమిన్ కె కు మంచి మూలం.

# వరల్డ్ కప్‌తో అరంగేట్రం!




వెస్టిండీస్: విండీస్ ఆల్‌రౌండర్ కీరన్ పొలార్డ్ పుట్టినరోజు నేడు. నేటితో అతడు 34వ వసంతంలో అడుగుపెడుతున్నాడు. ఈ క్రమంలో సహచర ఆటగాళ్లు, ముంబై ఇండియన్స్, అభిమానుల నుంచి పొలార్డ్‌కు శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ఈ సందర్భంగా.. ఈ విధ్వంసకర క్రికెటర్ గురించి ఆసక్తికర అంశాలు మీకోసం.. పొలార్డ్ 1987, మే12న ట్రినిడాడ్‌లోని టకరిగ్వాలో జన్మించాడు. 2007 వరల్డ్ కప్ టోర్నీలో భాగంగా ఏప్రిల్ 10న దక్షిణాఫ్రికాతో జరిగిన మ్యాచ్ ద్వారా అంతర్జాతీయ వన్డేల్లో అరంగేట్రం చేశాడు. ఇప్పటివరకు 116 వన్డేలు ఆడిన పొలార్డ్ 2564 పరుగులు చేశాడు. ఇందులో 3 సెంచరీలు, 11 అర్ధ సెంచరీలు ఉన్నాయి. ఇక బౌలింగ్ విషయానికొస్తే.. వన్డేల్లో 54 వికెట్లు పడగొట్టాడు. ప్రస్తుతం అతడు వెస్టిండీస్ పరిమిత ఓవర్ల కెప్టెన్‌గా ఉన్నాడు. 2008లో ఆస్ట్రేలియాతో జరిగిన టీ20 మ్యాచ్‌తో పొలార్డ్ పొట్టి ఫార్మాట్‌లో ఎంట్రీ ఇచ్చాడు. ఇప్పటివరకు 79 అంతర్జాతీయ టీ20లు ఆడిన పొలార్డ్ 1277 పరుగులు చేశాడు. 37 వికెట్లు తన ఖాతాలో వేసుకున్నాడు. ముంబై ఇండియన్స్ తరఫున 2010లో ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో అడుగుపెట్టిన పొలార్డ్ .. టోర్నీలో ఇప్పటిదాకా 171 మ్యాచ్‌లు ఆడి 3191 పరుగులతో సత్తా చాటాడు. ఐపీఎల్‌లో 63 వికెట్లు తీసి తాను ప్రాతినిథ్యం వహించిన జట్ల విజయాల్లో కీలక పాత్ర పోషించాడు. పొలార్డ్ ప్రస్తుతం ముంబై ఇండియన్స్ తరఫున ఆడుతున్నాడు. కరోనా నేపథ్యంలో ఐపీఎల్-2021 నిరవధికంగా వాయిదా పడిన నేపథ్యంలో ఇంటి బాటపట్టాడు.

# తమిళ పవర్ స్టార్ తెలుగు డెబ్యూకి అన్ని కోట్లు ఇస్తున్నారా..?



తమిళ పవర్ స్టార్ విజయ్ త్వరలోనే డైరెక్ట్ తెలుగు సినిమా చేయనున్నారని గత కొన్ని రోజులుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఇవన్నీ నిజమే అని ఇప్పుడు కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. దిల్ రాజు ప్రొడక్షన్ లో వంశీ పైడిపల్లి దర్శకత్వంలో విజయ్ ఎంట్రీ ఉంటుందని తెలుస్తోంది. ఇప్పటికే వంశీ చెప్పిన కథకు హీరో సైడ్ నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చినట్లు తెలుస్తోంది. ఇది విజయ్ కెరీర్ లో 66వ సినిమాగా రూపొందనుంది. దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన కూడా త్వరలోనే వెలువడనుంది. అయితే దిల్ రాజు ఈ ప్రాజెక్ట్ సెట్ చేయడం కోసం విజయ్ కు భారీ రెమ్యూనరేషన్ ఆఫర్ చేసినట్లు తెలుస్తోంది.కోలీవుడ్ స్టార్ హీరోల్లో ఒకరైన దళపతి విజయ్ అక్కడ తన రేంజ్ కి తగ్గట్టే భారీ పారితోషకం తీసుకుంటారు. ఒక్కో సినిమాకి ఆయన 75 - 80 కోట్లు తీసుకుంటారనే ప్రచారం ఉంది. అయితే ఇప్పుడు దిల్ రాజు దీనికి అదనంగా విజయ్ కు మరో 10 కోట్లు ఆఫర్ చేసాడని.. ఈ ప్రాజెక్ట్ కు విజయ్ దాదాపు 85 - 90 కోట్లు అందుకోనున్నారని సినీ వర్గాల్లో టాక్ నడుస్తోంది. ఇక ఈ సినిమా బడ్జెట్ కూడా 150 కోట్లకు పైగా ఉండే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ఇదే కనుక నిజమైతే ఈ సినిమా బిజినెస్ ఏ స్థాయిలో ఉండాలనే దాని గురించి ఇండస్ట్రీలో చర్చించుకుంటున్నారు.‹ఊపిరి› ‹మహర్షి› వంటి రెండు వరుస బ్లాక్ బస్టర్స్ ఇచ్చిన డైరెక్టర్ వంశీ పైడిపల్లి.. ఇటీవల ‹మహర్షి› చిత్రానికి నేషనల్ అవార్డ్ రావడంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్నాడు. దీంతో వంశీ నెక్స్ట్ సినిమా ఏంటనే ఆసక్తి పెరిగింది. ఈ నేపథ్యంలో వంశీ డైరెక్షన్ లో విజయ్ హీరోగా భారీ సినిమా సెట్ చేశాడు దిలరాజు. ఈ మధ్య పెద్ద సినిమాలన్నింటిని వేరే నిర్మాణ సంస్థలతో కలసి నిర్మిస్తున్న దిల్ రాజు.. శంకర్ - చరణ్ ప్రాజెక్ట్ చేంజ్ సోలోగా చేస్తున్నారు. అయితే విజయ్ తో చేసే భారీ బడ్జెట్ సినిమాని ఓ తమిళ ప్రొడక్షన్ హౌస్ తో కలిసి నిర్మిస్తారని టాక్. అందుకే హీరోకి అంత పారితోషకం ఇవ్వడానికి రెడీ అయ్యారని అంటున్నారు. అలానే ఇది పాన్ ఇండియా లేదా పాన్ సౌత్ ఇండియా ప్రాజెక్ట్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఏదేమైనా ఈ సినిమాపై క్లారిటీ రావాలంటే అఫీసియల్ అనౌన్స్ మెంట్ వచ్చే వరకు ఆగాల్సిందే.

# సలార్ లో డార్లింగ్ సాలిడ్ సర్ప్రైజ్..!




పాన్ ఇండియా స్టార్ డార్లింగ్ ప్రభాస్.. రాధేశ్యామ్ మూవీ పూర్తిచేసి సాలిడ్ యాక్షన్ థ్రిల్లర్ ‹సలార్› సినిమా చేస్తున్నాడు. పక్కా మాస్ మాఫియా అంశాలతో సలార్ రూపొందుతుంది. అయితే పాన్ ఇండియా మూవీగా తెరకెక్కుతున్న సలార్ కు కేజీఎఫ్ ఫేమ్ ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్నాడు. అసలే కేజీఎఫ్ సినిమాతో తనకంటూ ప్రత్యేక ఫ్యాన్ బేస్ క్రియేట్ చేసుకున్నాడు ప్రశాంత్ నీల్. అలాంటి డైరెక్టర్ తో ప్రభాస్ సినిమా అంటే డార్లింగ్ ఫ్యాన్స్ ఒక్కసారిగా దిల్ ఖుష్ అయిపోయారు. వీరి కాంబినేషన్ ఎలా సెట్ అయిందో గాని ప్రభాస్ - ప్రశాంత్ నీల్ కాంబోలో సినిమా అని తెలిసినప్పటి నుండే సలార్ పై భారీ అంచనాలు పెరిగిపోయాయి.అయితే ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్నటువంటి సలార్ మూవీ వచ్చే ఏడాది రిలీజ్ ప్లాన్ లో ఉండగా ఇప్పటివరకు రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకుంది. ఈ సినిమాతో ప్రభాస్ లో నుండి మరో మాస్ యాంగిల్ బయటికి రానుందని ఇదివరకే డైరెక్టర్ చెప్పాడు. మరి ఆయన చెప్పినట్లుగానే డార్లింగ్ నెవర్ బిఫోర్ లుక్కులో కనిపించనున్నట్లు సలార్ పోస్టర్ చూస్తే అర్థమైంది. ఈ సినిమాలో ప్రభాస్ సరసన శృతిహాసన్ కథానాయికగా నటిస్తుంది. డార్లింగ్ - శృతి కాంబినేషన్ ఫస్ట్ టైమ్ కాబట్టి వీరి కెమిస్ట్రీ అదిరిపోతుందని టాక్. అయితే ఈ సినిమాలో హీరోయిన్ క్యారెక్టర్ జర్నలిస్ట్ అంటూ ఇదివరకే సోషల్ మీడియాలో పలు కథనాలు వైరల్ అయ్యాయి.కానీ ఇప్పుడు హీరో ప్రభాస్ పాత్ర గురించి పలు పుకార్లు ఇండస్ట్రీలో చక్కర్లు కొడుతున్నాయి. అయితే తాజా సమాచారం ప్రకారం.. ఈ సినిమాలో ప్రభాస్ ఓ పవర్ ఫుల్ క్యారెక్టర్ లో డ్యూయెల్ రోల్ పోషిస్తున్నట్లు టాక్. ఫ్యాన్స్ కూడా అలాంటి ఎక్సపెక్టషన్స్ లో ఉన్నారు. ఈ సాలిడ్ సలార్ మూవీలో ప్రభాస్ డ్యూయెల్ రోల్ పోషిస్తున్నాడని.. అందులో ఓ తండ్రి - కొడుకుగా ప్రభాస్ కనిపించనున్నాడని అంటున్నాయి సినీవర్గాలు. ఈ సినిమాలో ఓ గతం కూడా ఉంటుందని అందులో తండ్రిగా.. ప్రెసెంట్ కొడుకుగా ప్రభాస్ అలరించనున్నట్లు టాక్. మరి నిజమో కాదో తెలియదు గాని.. ఈ విషయం పై క్లారిటీ రావాల్సి ఉంది. ఈ సినిమాను విజయ్ కిరగందుర్ నిర్మిస్తుండగా.. రవిబస్రూర్ సంగీతం అందిస్తున్నాడు.

# వండర్ ఉమెన్ నే వేధించిన డైరెక్టర్

2018-20 సీజన్ మీటూ ఉద్యమం ఎంత స్పీడ్ గా నడిచిందో తెలిసిందే. ఇలాంటి ఉద్యమాలు ఎన్ని జరిగినా మార్పు అరకొరే. పనిచేసే చోట మహిళలకు వేధింపులు నిత్యకృత్యంగానే ఉన్నాయి. గ్లామర్ రంగంలో ఇలాంటి వివాదాలు వెంటనే బయటకు తెలుస్తాయి. అన్నిరంగాల్లో ఇలాంటి వేధింపులున్నా సినీప్రపంచం దొరికిపోతోంది.ఇండియాలోనూ మీటూ ఉద్యమం ఏ స్థాయిలో జరిగిందో తెలిసిందే. దాదాపు అన్ని భాషల నటీమణులు ముందుకొచ్చి తమకు జరిగిన అన్యాయాన్ని బయటపెట్టారు. పెను వివాదాలు చూశాం. ఇలాంటి వేధింపులు వండర్ వుమెన్ గాల్ గడోట్ కి తప్పలేదట.ఈ హాలీవుడ్ సెన్సేషన్ పట్ల డైరెక్టర్ అసభ్యంగా ప్రవర్తించాడట. సూపర్ హీరో చిత్రాల స్పెషలిస్ట్.. జస్టిస్ లీగ్ దర్శకుడు జాస్ వెడన్ ఈ వేధింపుల వికారానికి పాల్పడినట్లు తెలిపింది. ప్రస్తుతం వీరిద్దరి కాంబినేషన్ లో జస్టీస్ లీగ్ తెరకెక్కుతోంది. ఈ సినిమా సెట్ లోనే ఇద్దరి మధ్య క్రియేటివ్ డిఫరెన్సెస్ తలెత్తడంతో జాన్ తన కక్షను ఈ విధంగా తీర్చుకుంటున్నట్లు గాల్ గాడోట్ అభిప్రాయపడింది. జస్టిస్ లీగ్ లో గాడెట్ తన పాత్ర విషయంలో అసంతృప్తిగా ఉందిట. వండర్ ఉమెన్ కంటే ఇందులో పాత్ర మరింత అగ్రెస్సివ్ గా ఉందని.. తన పాత్ర ఫ్లోలో ఉండాలనే దర్శకుడికి సూచించడంతో జాన్ కి కోపం వచ్చిందిట.అప్పటి నుంచి గాడెట్ కు సమస్యలు మొదలైనట్లు తెలిపింది. అసభ్యంగా ప్రవర్తించడం..మాటలతో వేధించడం వంటి చర్యలకు పాల్పడినట్లు తెలిపింది. మాట వినకపోతే గాడోట్ కెరీర్ ని నానం చేస్తాడని హెచ్చరించాడట. జాస్ తో తన పాత్ర గురించి అలా మాట్లాడటమే సమస్యలు తెచ్చిపెడుతున్నాయని అవేదన వ్యక్తం చేసింది. గాడోట్ చేసిన ఈ వ్యాఖ్యలు హాలీవుడ్ సహా అంతర్జాతీయ మీడియాలో హాట్ టాపిక్ గా మారాయి. వెస్ట్రన్ దేశాల్లో చాలామంది నటీమణులకు ఇలాంటి ఇబ్బందులు తప్పడంలేదని తెలుస్తోంది.



## అలా ఓరగా చూసి వేడి పెంచిన మనోహరి

బాహుబలి మనోహరిగా నోరా ఫతేహి కి ఉన్న ఫాలోయింగ్ తెలిసిందే. ప్రపంచవ్యాప్తంగా ఈ మొరాకో బ్యూటీకి అభిమానులున్నారు. సినీనటిగా కెరీర్ ఆరంభమే విదేశీ డ్యాన్స్ షోలు.. రియాలిటీ షోలు.. ఈ భామకు ఎనలేని గుర్తింపును తెచ్చి పెట్టాయి. ఇక బాలీవుడ్ లో అడుగుపెట్టాక అక్కడ వరుసగా ఐటమ్ నంబర్లతో అదరగొట్టింది. సౌత్ లో తెలుగు ఇండస్ట్రీలోనూ పాపులారిటీ సంపాదించింది. నోరా మ్యూజిక్ ఆల్బమ్స్ అంతే క్రేజీగా వైరల్ అవుతున్నాయి.తనదైన ఫ్యాషన్ స్టేట్ మెంట్ .. డ్యాన్స్ స్కిల్స్ తో అన్ని ఇండస్ట్రీల్లోనూ తనకంటూ ఒక సముచిత స్థానాన్ని ఏర్పరచుకుంది. ఆమె ఆన్-పాయింట్ లుక్స్ కోసం సినీ ఫోటోగ్రాఫర్లు చకోర పక్షుల్లా వేచి చూస్తారంటే తనకు ఎంత క్రేజు ఉందో అర్థం చేసుకోవచ్చు. నోరా సోషల్ మీడియా పోస్టులు క్షణాల్లో అంతర్జాలాన్ని సునామీలా చుట్టేస్తాయి. ఇంతకుముందే ఈ బ్యూటీ లేటెస్ట్ ఫోటోషూట్ నుండి కొన్ని తాజా చిత్రాలను పంచుకుంది.






EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**